టీఎన్జీవోస్ నాయకులను కలిసిన డీఎస్పీ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ఇటీవల టీఎన్జీవోస్ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన సంద అశోక్, ఎడ్ల నవీన్ కుమార్‌లను దళిత్‌శక్తి ప్రోగ్రాం నాయకులు బుధవారం స్థానిక సెంట్రల్ గార్డెన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు వారికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరాయంగా పని చేసే నాయకులను సమాజం గుర్తిస్తుందనీ అన్నారు. సమర్థవంతంగా ఉద్యోగుల సంక్షేమం కోసం పాటుపడుతూ మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాయకులు సంతోష్, పవన్ కుమార్, భైంసా మార్కెటింగ్ శాఖ కార్యదర్శి అన్నెల అడెల్లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు నగేష్ ఉన్నారు.

ఉపాధిహామీలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

బెజ్జూర్ : ఉపాధిహామీ చట్టంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీఓ సురేందర్ అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిహామీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ మాట్లాడుతూ ఉపాధిహామీలో నిర్లక్ష్యం వహించొద్దని, అధికారుల నిర్లక్ష్యాన్ని సహించమని హెచ్చరించారు. ఉపాధిహామీ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. చేపట్టిన పనులకు వెంటనే బిల్లులు చెల్లిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మాధవి, ఎంపీఓ రమేష్‌రెడ్డి, ఏపీఓ చంద్రయ్య, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.



కంటి వెలుగు విజయవంతం చేయండి

- ఎంపీపీ గోదరి రమాదేవీలక్ష్మణ్

నవతెలంగాణ-జైపూర్



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల పరిషత్ అధ్యక్షురాలు గోదరి రమాదేవి లక్ష్మణ్ కోరారు. మండల ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు బెజ్జాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో కంటి వెగులు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 18 సంవత్సరాల పైబడిన వారికి కంటి పరీక్షలు చేస్తారన్నారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇప్పటికే గ్రామ పంచాయతీల వారీగా గ్రామీణులకు అవగాహన కల్పించామని తెలిపారు. మండల ప్రత్యేక అధికారి ప్రభాకర్‌రావుతో పాటు తహసీల్దార్ మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ సత్యనారాయణతో కలిసి గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి కంటి సమస్య ఉన్న ప్రతి ఒక్కరు కంటి వెలుగు కార్యక్రమం ద్వార పరిక్షలు చేయించుకోవాలని సూచించామని పేర్కొన్నారు. పరీక్షలు చేయించుకునే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఆదేశాల మేరకు అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. 80 రోజుల పాటు కొనసాగే కంటి వెలుగు కార్యమం ద్వారా కంటి సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందిస్తామని పేర్కొన్నారు. కంటి వెలుగు కార్యక్రమం విజయవంతానికి జెడ్పీటీసీ మేడి సునిత తిరుపతితో పాటు వివిధ గ్రామ పంచాయతీలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు ఎక్కడిక్కడ సహాయ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఎరువుల కొనుగోలుకు రైతులకు రశీదు ఇవ్వాలి



జైపూర్ : పంటల సాగుకు రసాయన ఎరువులు, పిచికారి మందులు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు విధిగా రశీదు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి కల్పన సూచించారు. మండల కేంద్రంలో గల డీసీఎంఎస్ రైతు సేవా కేంద్రంతో పాటు ముదిగుంటలో గల డీసీఎంఎస్ రైతు సేవా కేంద్రాలను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతు సేవా కేంద్రాల్లో నిల్వ ఉంచిన రసాయన ఎరువులు, పిచికారి మందుల కాల పరిమితిని తనిఖీ చేశారు. రైతు సేవా కేంద్రాలను ఆశ్రయించిన రైతులకు విధిగా పీఓసీ మిషన్ ద్వారా ఎరువులు విక్రయించాలని సూచించారు. అదేవిధంగా రైతులు విధిగా ఆధార్ కార్డుతో రైతు సేవా కేంద్రాలను ఆశ్రయించాలని సూచించారు. కానుకూరు గ్రామంలో పంట నమోదు ప్రక్రియను తనిఖీ చేసిన ఆమె గ్రామంలో గల వరి, మామిడి, కూరగాయ పంట క్షేత్రాలను పరిశీలించారు. పంట నమోదు కార్యక్రమంలో ఈ పంటలకు సంబంధించిన వివరాలను నమోదు చేయాలని స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వర్‌గౌడ్, రైతుబంధు సమితి కో ఆర్డినేటర్ గుర్ల భీంరావు, ఏఈఓ కొమురయ్య పాల్గొన్నారు.

చెప్రాడకు మహా పాదయాత్ర ప్రారంభం



బెజ్జూర్ : మండలం నుండి మహారాష్ట్రలోని చెప్రాడ కార్తీక్ మహారాజ్ స్వామి ఆధ్యాత్మిక క్షేత్రానికి 18వ మహా పాదయాత్రను బుధవారం మండలంలోని ఎలుకపెల్లి(బి) అభయాంజనేయ స్వామి ఆలయం నుండి బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ పాదయాత్ర 18 ఏండ్లుగా కొనసాగుతోంది. ఈ పాదయాత్ర బెజ్జూర్, కుకుడ, పోతెపెల్లి, బారెగూడ, ముంజంపల్లి, అలాగే చింతలమానేపెల్లి మండలంలోని రుద్రాపూర్, చింతలమానేపెల్లి, బాలాజీ అనకోడ, రవీంద్రనగర్, బాబాపూర్ గ్రామాల మీదుగా పాదయాత్ర కొనసాగుతుంది. అనంతరం ప్రాణహిత నదిని పడవలపై దాటి మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా ప్రశాంత్‌దాం ఆధ్యాత్మిక క్షేత్రం చెప్రాడకు చేరుతుంది. పాదయాత్ర సుమారు 45 కిలోమీటర్లు కొనసాగనుంది. పాదయాత్ర భక్తులకు మండల కేంద్రంలో హెక్టర్ హైమద్ యూత్ నాగుల్వాయి యూత్, ఆర్ఎంపీ ఆధ్వర్యంలో పండ్లు, అల్పాహారం పంపిణీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్ఐ వెంకటేశ్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ, బెజ్జూర్ రంగనాయక ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు జిల్లాల సుధాకర్‌గౌడ్, తంగడిపల్లి మహేష్, బెజ్జూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీవర్ధన్, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు నరేందర్‌గౌడ్, బీజేపీ అధ్యక్షుడు జాడి దిగంబర్, బీజేపీ నాయకులు పుల్లూరు సతీష్, పాల్గొన్నారు.

కంటి వెలుగు ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీపీ

కౌటాల : మండల కేంద్ర గ్రామ పంచాయతీలో గురువారం కంటి వెలుగు కార్యక్రమ ఏర్పాట్లను ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ పరిశీలించారు. కంటి పరీక్షలకు వచ్చే వ్యాధిగ్రస్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని గ్రామ పంచాయతీ సర్పంచ్, కార్యదర్శులకు సూచించారు. అన్ని పరికరాలను పరిశీలించారు. ఆయన వెంట సర్పంచ్ వొజ్జెల మౌనీష్, ఎంపీఓ సుధాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ తిరుపతి, వైద్యసిబ్బంది, కార్యదర్శి సాయికృష్ణ ఉన్నారు.

సిర్పూర్(టి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సామాన్య ప్రజలకు కంటి చూపును మెరుగుపరచడానికి తీసుకొచ్చిన కార్యక్రమం కంటి వెలుగని, ఏ కంటి సమస్య ఉన్నా కేంద్రంలో పరీక్ష చేయించుకొని సద్వినియోగం చేసుకోవాలని కంటి వెలుగు మండల ప్రత్యేకాధికారి వెంకటేశం అన్నారు. మండలంలోని ఇటికల్‌పహాడ్ గ్రామస్తులతో సమావేశమై ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. ప్రజలందరికి కంటి వైద్యం అందుబాటులోకి తీసుకురావడానికి కంటి వెలుగు శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. శిబిరాల్లో కంటి సమస్యలున్న వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కళ్లద్దాలు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ రాజేశ్వర్, మెడికల్ ఆఫీసర్ నవత, వైద్య సిబ్బంది ఉన్నారు.

కంటి పరీక్షలకు వేళాయే..!

- నేటి నుంచి కంటి వెలుగుకు శ్రీకారం
- పీహెచ్‌సీల్లో రోజువారీగా గ్రామాలు, వార్డుల కేటాయింపు
- జిల్లాకు చేరిన 30వేల కంటి అద్దాలు
- ఉదయం 9గంటల నుంచి ప్రారంభించేందుకు నిర్ణయం

అంధత్వం లేని తెలంగాణతో పాటు కంటి సమస్యలను దూరం చేసేందుకు ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇది వరకే తొలి దశలో ఈ కార్యక్రమం చేపట్టగా.. మరోసారి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చేపట్టేందుకు ప్రభుత్వం అంకురార్పణ చేసింది. బుధవారం ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ కార్యక్రమాన్ని ఖమ్మంలో అధికారికంగా ప్రారంభించగా.. జిల్లాల వారీగా గురువారం నుంచి చేపట్టాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తిచేశారు.ఇప్పటికే కంటిని పరీక్షించే పరికరాలు చేరిపోగా.. అవసరమైన వారికి అక్కడే అందించేందుకు కంటి అద్దాలు కూడా పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే వైద్య బృందాలు, సిబ్బంది నియామకాలను పూర్తిచేసిన అధికారులు పీహెచ్‌సీ, యూహెచ్‌సీల్లో గ్రామాలు, వార్డుల వారీగా రోజువారీగా రావాల్సిన లబ్దిదారుల వివరాలను కూడా వెల్లడించారు. మరోపక్క రెండు రోజుల క్రితం ఉన్నతాధికారులు ట్రయల్ రన్ నిర్వహించి పరికరాలను పరీక్షించారు. అధికారికంగా నేటి నుంచి ఉదయం 9గంటల నుంచి ప్రారంభం కానుందని అధికారులు చెబుతున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలను ఆ ఇబ్బందుల నుంచి దూరం చేసేందుకు ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం చేపడుతోంది. ఇది వరకే నాలుగేండ్ల క్రితం 2018 ఆగస్టు నుంచి 2019 ఫిబ్రవరి వరకు ఆరు నెలల పాటు చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు 3.90లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో సుమారు 32వేల మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించగా.. 27వేల మందికి అందించారు. ఈ దఫా సైతం 18 ఏండ్లు పైబడిన ప్రతి ఒక్కరిని పరీక్షించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలో వీరి సంఖ్య సుమారు 4లక్షల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. వీరందరికీ పీహెచ్‌సీలు, అర్బన్‌సెంటర్ల వారీగా పరీక్షలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆయా పీహెచ్‌సీల పరిధిలో రోజువారీగా చేపట్టే గ్రామాలు, వార్డుల వివరాలను అధికారులు వెల్లడించారు. వీరిని పరీక్షించడం పూర్తయిన తర్వాత మిగితా వారికి పరీక్షలు చేయనున్నారు. ఆదిలాబాద్ జిల్లాకు సుమారు 30వేల వరకు కంటి అద్దాలు కూడా చేరుకున్నాయి. అత్యవసరమైన వారికి అక్కడే అందజేయనున్నారు. మిగితా అవసరమైన వారికి కంటి అద్దాల కోసం సంబంధిత కంపెనీకి వివరాలను పంపించనున్నారు. ఆన్‌లైన్‌లో సంబంధిత పీహెచ్‌సీలకు చేరుకునేలా కార్యాచరణ రూపొందించారు.

మూడు నెలల పాటు కొనసాగింపు

ఆదిలాబాద్ జిల్లాలో కంటి వెలుగును విజయవంతం చేసేందుకు అధికార యంత్రాంగం ముందస్తుగా ట్రయల్ రన్ చేపట్టింది. జిల్లా కేంద్రంలోని వైటీసీ కేంద్రంలో జిల్లాకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పరికరాలను పరిశీలించడంతో పాటు కంటి పరీక్షలు చేయించుకున్నారు. ముఖ్యంగా జిల్లావ్యాప్తంగా 33సెంటర్లలో చేపట్టే ఈ కార్యక్రమం కోసం 33మంది చొప్పున వైద్యులు, ఆప్తాల్మిక్ అధికారులు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, సూపరింటెండెంట్లను నియమించారు. వీరితో పాటు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఆయా కేంద్రాల్లో అందుబాటులో ఉండనున్నారు. ఆయా గ్రామాల వారీగా చేపడుతున్న ఈ కార్యక్రమం సుమారు మూడు నెలల పాటు నిరంతరంగా కొనసాగనుంది. మరోపక్క శస్త్రచికిత్సలు అవసరమయ్యే వారిని సంబంధిత ఆస్పత్రులకు రిఫర్ చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆయా కేంద్రాల్లో రోజూ 300 నుంచి 400మంది చొప్పున కంటి పరీక్షలు చేయనున్నారు. మరోపక్క ఆయా పీహెచ్‌సీలు, యూహెచ్‌సీల్లో పనిచేస్తున్న రెండో ఏఎన్ఎంలు తమను ఆన్‌లైన్‌లో వివరాల నమోదు బాధ్యత నుంచి తప్పించాలని కోరుతున్నారు. ఈ బాధ్యతను కొత్తగా నియమించిన డాటా ఎంట్రీ ఆపరేటర్లకు అప్పగించాలని చెబుతున్నారు. ఇందుకు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ విధులు నిర్వర్తించాలని భావిస్తున్నట్లు రెండో ఏఎన్ఎంల సంఘం నాయకులు చెబుతున్నారు.



అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం : డాక్టర్ నరేందర్‌రాథోడ్, డీఎంహెచ్‌ఓ, ఆదిలాబాద్



జిల్లాలో కంటి వెలుగును విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇప్పటికే పరికరాలను పరిశీలించేందుకు ట్రయల్ రన్ నిర్వహించాం. కంటి అద్దాలు కూడా జిల్లాకు చేరుకున్నాయి. ఆయా పీహెచ్‌సీలు, యూహెచ్‌సీల వారీగా చేపట్టే ఈ కార్యక్రమానికి సంబంధించి సమాచారం ప్రజలకు చేరవేశాం. అర్హులైన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

కంటి వెలుగు పరీక్ష కేంద్రం పరిశీలన



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగును పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ జోగుప్రేమేందర్ సూచించారు. బుధవారం పట్టణంలోని వైటిసిలో రెండవ విడత కంటి వెలుగు ఏర్పాట్లను సమీక్షించారు. నేటి నుండి రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమం పున : ప్రారంభం కానున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి వైద్యాధికారులు, సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. కంటి వెలుగు శిబిరాలకు వచ్చే వారి వివరాల నమోదు, పరీక్షల నిర్వహణ తదితర అంశాలపై అధికారులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన పూర్తి చర్యలు తీసుకోవాలని సూచిస్తూ కంటి వెలుగు సిబ్బందితో కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఆయన వెంట అదనపు డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ సాధన, కంటి వెలుగు పర్యవేక్షకులు జాడి లింగేష్, సిబ్బంది ఉన్నారు.

గుడిహత్నూర్ : కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని కంటి వెలుగు జాయింట్ డైరెక్టర్ బాబు అన్నారు. మండలంలోని కొల్హరి కంటి వెలుగు కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కంటి వెలుగుపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. సర్పంచ్ కల్పనా గిత్తే, మెడికల్ అఫీసర్ డాక్టర్ శ్యాంసుందర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

కుభీర్ : 1020 మందిని కంటి పరీక్షలు చేయించుకునేందుకు ఎంపిక చేశామని ఎస్సీ కార్పొరేషన్ అధికారి హనుమల్లు అన్నారు. బుధవారం మండలంలోని మాలేగాంలో సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, మండల అధికారులతో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విశ్వంబర్, ఎంపీడీఓ కవిరాజ్, పీహెచ్‌సీ వైద్యులు రాథోడ్ సంతోష్, అవినాష్, ప్రణయ్ పాల్గొన్నారు

కాగజ్‌నగర్ : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని సీనియర్ సిటిజన్లు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, మండల అధ్యక్షులు ఎల్లాగౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఉచితంగా పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలను కూడా ఉచితంగా అందించనున్నారని, ఈ సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సేవలందిస్తాం

- సద్గురు మధుసూదన్ సాయి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సేవలను త్వరలోనే అందిస్తామని సద్గురు మధుసూదన్‌సాయి అన్నారు. శ్రీ సత్యసాయి సుజల ప్రవంతి ట్రస్టు ఆధ్వర్యంలో కాగజ్‌నగర్‌లో నెలకొల్పిన సాయి స్వస్థ వెల్‌నెస్ సెంటర్‌ను స్థానిక ఎమ్మెల్యే కోనేరు కోనప్పతో కలిసి ప్రారంభించారు. ఈ కేంద్రంలో ప్రజలకు ఉచిత డయాగ్నస్టిక్ సేవలతో పాటు డిస్పెన్సరీ సేవలను అందించనున్నారు. కేంద్రం ప్రారంభం తర్వాత వినయ్ గార్డెన్‌లో సందేశ సభ నిర్వహించారు. ఈ సభలో మధుసూదన్‌సాయి మాట్లాడుతూ పదేళ్ల క్రితం తాను ఇక్కడికి వచ్చానని, అప్పుడే ఇక్కడి సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసకుంటానని చెప్పినట్లు తెలిపారు. మారుమూల ప్రాంతం కావడంతో ఇక్కడ ఉచిత వైద్య పరీక్షల కోసం ఈ కేంద్రాన్ని నెలకొల్పినట్లు తెలిపారు. ప్రజలంతా సహకరిస్తే త్వరలోనే దీన్ని పూర్తి స్థాయి మాతా, శిశుసంరక్షణ కేంద్రంగా మలిచి పెద్దాసుపత్రి సేవలను ఉచితంగా అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. దీనికి ముందు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మాట్లాడుతూ సేవే లక్ష్యం సేవే ధ్యేయంతో ముందుకు పోతున్న సత్యసాయి సేవా ట్రస్టుకు తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు. ఇక్కడి గిరిజనులు రక్తహీనతతో బాధపడుతున్నారని, ట్రస్టు తరపున సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నెలకొల్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు, జిల్లా విద్యాశాఖాధికారి అశోక్, సత్యసాయి సంజీవని ట్రస్టు జాతీయ అధ్యక్షులు డాక్టర్ సి శ్రీనివాస్, స్థానిక ట్రస్టు నిర్వాహకులు మల్లేశం, రఘువీర్‌సింగ్, లక్ష్మణ్, మురళి, సంతోష్ పాల్గొన్నారు.

ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో రాక

సద్గురు శ్రీ మధుసూదన్ సాయి ఉదయం 11గంటలకు కాగజ్‌నగర్‌కు ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో రావడంతో ప్రజలంతా ఆసక్తిగా తిలకించారు. కర్ణాటకలోని ముద్దనహళ్లి నుండి ఆయన కాగజ్‌నగర్ చేరుకున్నారు. స్థానిక ఎస్పీఎం క్రీడా మైదానంలో హెలిక్యాప్టర్‌లో దిగిన ఆయనకు ఎమ్మెల్యే కోనేరు కోనప్పతో పాటు నిర్వాహకులు స్వాగతం పలికారు.

రెబ్బెనలో భూకబ్జాలు



నవతెలంగాణ - రెబ్బెన

మండల కేంద్రంలో ప్రభుత్వ భూములను అధికార పార్టీ నాయకులు కబ్జా చేస్తున్నారు. నాలుగు వరుసల రహదారి కావడంతో రోడ్డు పక్కనున్న స్థలాలకు భారీగా డిమాండ్ పెరగడంతో నాయకుల కండ్లు భూములపై పడ్డాయి. భూకబ్జాలు చేస్తూ డేరాలు ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం రాత్రి ప్రభుత్వ భవనం(తాత్కాలిక ప్రెస్‌క్లబ్) పక్కన గల ప్రభుత్వ భూమిలో బీఆర్ఎస్‌కు చెందిన నాయకుడు టేలాను ఏర్పాటు చేశారు. ఈ విషయంపై విలేకరులు ప్రశ్నించగా వాదనకు దిగాడు. పక్కనున్న ప్రభుత్వ స్థలంలో టేలాను ఉంచారు. ఎమ్మెల్యేకు చెప్పి చేస్తున్నట్టు పేర్కొన్నారు. గతంలో రైతువేదిక పక్కనున్న ప్రభుత్వ భూమిలో రామాలయం ముందుభాగంలో టేలాలు వెలిశాయి. మండలంలోని బీఆర్ఎస్ నాయకుడు ఆధిపత్యం చెలాయిస్తూ యజమానుల నుండి డబ్బులు తీసుకొని టేలాలను పెట్టించారని మండల ప్రజలు పేర్కొంటున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ మల్లికార్జున్‌ను వివరణ కోరగా సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన టేలా యజమానితో మాట్లాడానని, వెంటనే తీయిస్తానని సమాధానమిచ్చారు. ప్రభుత్వ భూమిలో ఏర్పాటైన టేల యజమానులకు నోటీసులు పంపించి వెంటనే తొలగిస్తామని పేర్కొన్నారు.

ప్రభుత్వ భూములను కబ్జా నుంచి కాపాడి పేదలకివ్వాలి : సీపీఐ(ఎం)



నవతెలంగాణ-కోటపల్లి

ప్రభుత్వ భూములను కబ్జా నుండి కాపాడి పేదలకు ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. చెన్నూరు, కోటపల్లి మండలాల ముఖ్య బాధ్యుల సమావేశం బుధవారం చెన్నూరు మండల కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నూరు మండలంలోని ప్రభుత్వ భూములు ధనవంతులు ఆక్రమించుకొని ప్లాట్లు చేసి అమ్ముకుంటున్నారన్నారు. ప్రభుత్వం, అధికారులు జోక్యం చేసుకొని ప్రభుత్వ భూములను కాపాడి, ఇండ్లు, స్థలాలు లేని పేదలకు పంచాలని కోరారు. చెన్నూరు పట్టణంలో భూమి, ఇల్లు లేని నిరుపేద కుటుంబాలు చాలా ఇబ్బందులు పడుతున్నాయని, పని లేక ఇల్లు కిరాయి కూడా చెల్లించలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెన్నూరు పట్టణ కేంద్రంలో రోడ్డు నిర్మాణ పనులు మూడు సంవత్సరాలుగా నత్తనడకన సాగుతున్నాయని, దుమ్మూధూళితో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, సత్వరమే రోడ్డు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎర్మ పున్నం, జిల్లా కమిటీ సభ్యులు బోడంకి చందు, కోటపల్లి మండల కార్యదర్శి కావిరి రవి, మారన్న, కరీమ, ఎండి అవేజ్, చంద్రన్న, శ్రావణ్‌కుమార్, తిరుపతి పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ సూచించారు. జాతీయ రహదారి సంస్థ, డిబిఎల్ కంపెనీ ప్రతినిధులతో కలిసి పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థి దశ నుండి అవగాహన కలిగి ఉండాలన్నారు. రోడ్డుపై వెళ్తున్నప్పుడు నియమ నిబంధనలు పాటించినట్లయితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో డిబిఎల్ (దిలీప్ బిల్డ్కాన్ లిమిటెడ్) రీజనల్ ఇంజనీర్ సయ్యద్ ఎజాజ్ అహ్మద్, సేఫ్టీ ఇంజనీర్ నీరజ్ కుమార్, అసిస్టెంట్ సేఫ్టీ మెనెజర్ మహా రాణా ప్రతాప్, మెటీరియల్ ఇంజనీర్ రాఘవేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, పీడీ తిరుపతి పాల్గొన్నారు.

ఖానాపూర్ : రోడ్డు నిబంధనలను ప్రతి ఒక్కరు తప్పకుండా పాటించాలని ఎస్సై రుక్మావర్ శంకర్ అన్నారు. బుధవారం ఖానాపూర్ పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కాలనీలో ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనాల ధ్రువపత్రాలను సక్రమంగా ఉంచుకోవాలని, హెల్మెట్లు ధరించాలని సూచించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు.

'కంటి వెలుగు'లో భాగస్వాములు కావాలి : కలెక్టర్ సిక్తా పట్నాయక్

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

నేటి నుండి జిల్లాలో ప్రారంభమయ్యే కంటి వెలుగు కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములై విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమం వంద పని దినాలలో షెడ్యూల్ ప్రకారం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. శాసనసభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు వారి పరిధిలోని కేంద్రాలలో గురువారం రోజున ఉదయం 9గంటలకు రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. మండల, వార్డుల ప్రత్యేక అధికారులు ఆయా కేంద్రాలలో హాజరై ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అలాగే రోజువారి క్యాంపులను పర్యవేక్షించాలని అన్నారు. జిల్లాలో దృష్టి లోపం కలిగిన వారికి పరీక్షలు నిర్వహించేందుకు 33 టీమ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు.

గిరి విద్యార్థులకు ప్రోత్సాహం : ఐటీడీఏ పీఓ వరుణ్‌రెడ్డి

నవతెలంగాణ-ఉట్నూర్

గిరి విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేందుకు ఐటీడీఏ ద్వారా ప్రోత్సహిస్తామని ఐటీడీఏ పీఓ వరుణ్ రెడ్డి అన్నారు. బుధవారం ఐటీడీఏ పీఓ క్యాంపు కార్యాలయంలో ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన ఫోటోగ్రఫీలో ఉట్నూర్ మండలానికి చెందిన సిడాం మౌనికను అభినందించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ మారుమూల గ్రామం నుండి జిల్లా స్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు ఎదిగి పోటీలలో పాల్గొనీ పతకం సాధించడం జిల్లాకే గర్వకారమన్నారు. చదువు కోసం తనకి ఐటీడీఏ ద్వారా లాప్‌టాప్ అందించాలని పీఓని విద్యార్థి కోరగా స్పందించిన పీఓ ల్యాప్‌టాప్ అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కిషన్ మిత్ర కోఆర్డినేటర్ కుమ్ర వినాయక్ రావ్ ఉన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరంపై అవగాహన

నవతెలంగాణ-ఖానాపూర్

పట్టణం గాంధీనగర్ కాలనీ ఒకటో వార్డులో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరంపైన ఇంటింటికి తిరుగుతూ అవగాహన కల్పించి, ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఖానాపూర్ మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్ మాట్లాడుతూ కాలనీలో ఇంటింటికి వెళ్లి పిల్లలకు వృద్ధులకు ప్రతి ఒక్కరికి దగ్గర చూపు, దూరపు చూపు, కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఒకటో వార్డు కౌన్సిలర్ కావలి సంతోష్ మున్సిపల్ కమిషనర్ చిక్యాల రత్నాకర్‌రావు, మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది, వైద్యులు, హాస్పిటల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, ఆశా వర్కర్లు, కాలనీవాసులు పాల్గొన్నారు.

విశ్రాంతి గదుల నిర్మాణానికి విరాళం



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని ప్యారామూర్ గ్రామంలో గల దత్త ఆశ్రమంలో అదనపు గదుల నిర్మాణం కోసం బుధవారం పోతుగంటి లక్ష్మణ్ టీచర్ రూ.51వేలు ఆశ్రమ కమిటీ సభ్యులకు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ కమిటీ సభ్యులు, గ్రామస్తులు విరాళం దాతను శాలువాతో సన్మానించి, అభినందించారు.

బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

బడి బయటి పిల్లలను గుర్తించడంలో భాగంగా బుధవారం బంగారిగూడ ఆవాస ప్రాంతంలో 6నుండి14 సంవత్సరాలు కలిగిన ఇద్దరు అమ్మాయిలను గుర్తించి బడిలో చేర్పించడం జరిగిందని ప్రధానోపాధ్యాయుడు మంద అశోక్ సీఆర్పీ దేవదర్శన్ అన్నారు. బడి ఈడు పిల్లలు పనిలో గాని బయట ఉన్నట్లయితే వాళ్లని గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. బడీడు పిల్లలను పనిలో పెట్టుకుంటే నేరమని అన్నారు. బడి పిల్లలను పనిలో పెట్టుకుంటే యజమానిపై తల్లిదండ్రులపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు.

కొరియా విద్యా సంస్థ ప్రతినిధులతో వీసీ సమావేశం



నవతెలంగాణ-బాసర

హైదరాబాద్‌లోని ఆర్జీయూకేటీ క్యాంపు కార్యాలయంలో బుధవారం కొరియాకు చెందిన మైండ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ హైదరాబాద్ శాఖ ప్రతినిధి బృందంతో ఆర్జీయూకేటీ వీసీ వెంకటరమణ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ కొరియా విద్య సంస్థలతో ఒప్పంద అవగాహన వల్ల యూనివర్శిటీ అకాడమిక్ పరమైన, విద్యాపరమైన సహాయ సహకారాలు అందిపుచ్చుకోవచ్చన్న చర్చలతో ఒక అవగాహనకు వచ్చామని అన్నారు. మైండ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ అధ్యక్షుడు జాయ్ హంగ్ కిమ్ మాట్లాడుతూ ఆర్జీయూకేటీ ఉన్నత విద్యాసంస్థతో పని చేయడానికి మేము సన్నద్ధమవుతున్నందుకు సంతోషంగా ఉందని త్వరలో అవగాహన ఒప్పంద కుదుర్చుకొని వివరాలు వెల్లడిస్తామని అన్నారు. ఈ సంవత్సరం జూన్‌లో కొరియాలో జరిగే ఎడ్యుకేషన్ ఫెయిర్ సమావేశాలకు ఆర్జీయూకేటి వీసీని ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆయా యూనివర్శిటీల అధికారులు పాల్గొన్నారు.

నంది రామయ్యను పరామర్శించిన ఏఐపీకేఎస్ నాయకులు



నవతెలంగాణ-ఖానాపూర్

గత రెండు నెలల కాలం నుండి అనారోగ్యంతో బాధపడుతున్న ఏఐపీకేఎస్ సహాయ కార్యదర్శి నంది రామయ్యను బుధవారం ఏఐపీకేఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రాయల చంద్రశేఖర్ ఖానాపూర్ విద్యానగర్‌లోని తన నివాసంలో కలిసి ఆరోగ్య సమస్యలు తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారితో పాటు సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా జిల్లా కార్యదర్శి కే.రాజన్న, ఏఐపీకేఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మడావి అంకుష్‌రావు, జిల్లా నాయకులు దాసన్న సుదర్శన్ ఉన్నారు.

ఎస్సీ హాస్టల్‌కు స్థలం కేటాయించాలి

నవతెలంగాణ-బేల

మండల కేంద్రంలో 35 ఏండ్లుగా అద్దె భవనంలో కొనసాగుతున్న ఎస్సీ హాస్టల్‌కు పక్కా భవనం కోసం స్థలం కేటాయించాలని ఏబీవీపీ జిల్లా హాస్టల్ కన్వీనర్ మడవార్ హరీష్ డిమాండ్ చేశారు. ఈ విషయమై బుధవారం తహసీల్దార్ బడాల రాంరెడ్డికు ఏబీవీపీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా హాస్టల్ కన్వీనర్ మడవార్ హరీష్ మాట్లాడుతూ ఎస్సీ హాస్టల్‌లో సరైన గదులు, టాయిలెట్స్ లేక తదితర అసౌకర్యాలతో విద్యార్థులు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఎస్సీ హాస్టల్ పక్కా భవనం కోసం ప్రభుత్వ స్థలం కేటాయించాలన్నారు. వెంటనే నిధులు మంజూరు చేసి పక్క భవనం నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. రెగ్యూలర్ వార్డెన్ నియమించాలన్నారు. విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు పెంపు కోసం ప్రత్యేక ట్యూటర్స్‌ను నియమించాలన్నారు. ఈ హాస్టల్‌ను ఇంటర్ వరకు అప్ గ్రేడ్ చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా ఎస్ఎఫ్డి కన్వీనర్ శివానిత్‌వార్ ఓం ప్రకాష్, ముజుందార్ ప్రీతం, బి.వినోద్ పవన్ రెడ్డి పాల్గొన్నారు.

ఏజెన్సీలో పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- ప్రయోగాత్మకంగా 30 గ్రామాల ఎంపిక
- ఐటీడీఏ పీఓ వరుణ్ రెడ్డి



నవతెలంగాణ-ఉట్నూర్

ఏజెన్సీ గ్రామాలలో పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఐటీడీఏ పీఓ కె.వరుణ్ రెడ్డి అన్నారు. బుధవారం ఉట్నూర్ కుమురంభీం కాంప్లెక్స్‌లోని యూత్ ట్రెనింగ్ సెంటర్‌లో రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య, ఐటీడీఏ సహకారంతో పాలమిత్రలకు ఎలక్ట్రానిక్ మిల్క్ టెస్టర్‌ల వినియోగంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ గిరి రైతులు ఆర్థికాభివృద్ధి సాధించేలా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ గ్రామాలలో పాడి పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రయోగాత్మకంగా 30 గ్రామాలను ఎంపిక చేసి గిరిజనులకు పాడి పశువుల కొనుగోలుకు రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. త్వరలోనే ఉట్నూరులో పాల శీతలీకరణ కేంద్రం ప్రారంభం కానున్న దృష్ట్యా ఉట్నూర్ సమీపంలోని 20 గ్రామాలలో పాల సేకరణ కేంద్రాలను స్థాపించి గ్రామస్థాయిలో పాల నాణ్యత పరీక్షలపై రూ.8లక్షల విలువ గల 20 మిల్క్ టెస్టర్లను పంపిణీ చేస్తామన్నారు. ప్రతి గ్రామంలో కనీసం 300 లీటర్ల పాల సేకరణ లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. గుజరాత్ రాష్ట్రంలో విజ్ఞాన యాత్రలు నిర్వహించి పాల సేకరణను పెంచే విధంగా పాలమిత్రలను ప్రోత్సహిస్తామని తెలిపారు. దాణా, పాల ఉత్పత్తి, వెన్న శాతం పెంచడం లాంటి అంశాలపై శిక్షణ, గోపాల మిత్రలుగా శిక్షణ అందిస్తామని అన్నారు. విజయ డైరీ డీడీ మధుసూదన్ మాట్లాడుతూ గిరిజన గ్రామాలలో ఐటీడీఏ సహకారంతో పాడి పరిశ్రమ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామన్నారు. పశు వైద్య శాఖ సమన్వయంతో పాల ఉత్పత్తి పెంపుదలకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పాడిపరిశ్రమ అభివృద్ధి, దాణా, పాల సేకరణ తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో జెడీఎం నాగభూషణ్, మేనేజర్ దస్రు, పంపిణీదారులు రమణారెడ్డి, సూపర్ వైజర్ అనిల్, రవి, రమేష్, అఖిల్ ఉన్నారు.

కంటి వెలుగును విజయవంతం చేయాలి

- నిర్మల్ కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ



నవతెలంగాణ-లక్ష్మణచాంద

కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రైతు వేదికలో ఏర్పాటు చేసిన రెండో విడుత కంటివెలుగు శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈనెల 19న రాష్ట్ర వ్యాప్తంగా రెండో విడత కంటివెలుగు పథకాన్ని ప్రారంభిస్తోందని అన్నారు. దానికి సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అక్కడ కల్పించిన సౌకర్యాలపకై ఆరా తీశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీకాంత్, ఎంపీడీఓ మోహన్, ఎంపీఓ నసీరుద్దీన్, తహసీల్దార్ కవితరెడ్డి, స్థానిక సర్పంచ్ ముత్యంరెడ్డి పాల్గొన్నారు.

ముథోల్: జిల్లాలో నేటి నుంచి జరిగే కంటి వెలుగు కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా అడిషనల్ కలెక్టర్ రాంబాబు పేర్కొన్నారు. బుధవారం కంటివెలుగు కార్యక్రమం నిర్వహణపై మండల కేంద్రంలోని పశుపతినాథ్ ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని ఆయన సందర్శించారు. గురువారం నుండి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి తగు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలోని మొత్తం 34 వైద్య బృందాలతో పాటు వైద్య యంత్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కంటివెలుగు కార్యక్రమంపై పలు వివరాలను అధికారులకు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తయినట్లు వివరించారు. గురువారం ముథోల్‌లోఎమ్మెల్యే విఠల్ రెడ్డి కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వివరించారు. ప్రతి సోమవారం నుండి శుక్రవారం వరకు 100 రోజులు ఈ కార్యక్రమం కొనసాగుతుందని అన్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి అధికారులకు అడిషనల్ కలెక్టర్ పలు సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కేవీవీ రవికుమార్, తహసీల్దార్ శ్యాంసుందర్, ఎంపీడీఓ సురేష్‌బాబు, ఎంపీఓ ఆమీర్‌ఖాన్, డాక్టర్ ఆకాష్, సూపర్‌వైజర్లు, ఆశ వర్కర్లు, పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ కలెక్టరేట్

ఆదిలాబాద్ పట్టణంలోని స్థానిక ఎన్టీఆర్ చౌక్‌లో బుధవారం స్వర్గీయ నందమూరి తారక రామారావు 27వ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం దాదాపు 500 మందికి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పార్లమెంట్ అధ్యక్షులు గుల్లపల్లి ఆనంద్ మాట్లాడుతూ ఎన్టీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు బడుగు బలహీన వర్గాలకు చేయూత నిచ్చి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, వర్గాలను చైతన్య పరిచిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు. ఆయన చేసిన సంక్షేమ పథకాలు సంస్కరణలు చిరస్మరణీయమని అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలో సుందరీకరణలో భాగంగా తొలగించిన ఎన్టీఆర్ విగ్రహాన్ని యథా స్థానంలో ప్రతిష్టించాలని ప్రభుత్వ యంత్రాంగానికి, స్థానిక మున్సిపల్ చైర్మెన్, ఎమ్మెల్యేకి విన్నవిస్తూ వారంలోగా విగ్రహాన్ని ఏర్పాటు చేయకపోతే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి అల్లూరి రాజారెడ్డి, ఆదిలాబాద్ పార్లమెంటు ప్రధాన కార్యదర్శులు పెరుగు ఆత్మారాం, తాళ్లపల్లి రాజేశ్వర్, సి.భూమన్న, ఎండీ రఫీక్, పి.దేవదాస్, ఆత్రం జ్ఞానసుధ, జి.నాగన్న, జి.ఒమన్న, ప్రభాకర్, సంతోష్ రెడ్డి, షేక్ అహ్మద్, కాడే రాములు, జి సుభాష్, ఎస్.గంగారెడ్డి, బి.రాజేశ్వర్ రావు, యం.బుచ్చన్న, పెంటన్న, ఎస్.పొచ్చన్న, టి.చంద్రయ్య సురేందర్ లండిగే, పంచపుల బాయి, ఆరె రాజన్న పాల్గొన్నారు.

పోడు పట్టాల పంపిణీలో ప్రభుత్వం విఫలం



నవతెలంగాణ-ఖానాపూర్

ఆదివాసులకు పోడు పట్టాల పంపిణీ చేయడంలో కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథ జిల్లా కార్యదర్శి కే రాజన్న అన్నారు. బుధవారం మండలం రంగపేట కుమురం భీమ్ నగర్‌లో జరిగిన సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మండల పార్టీ సభ్యుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోడు పట్టాల కోసం అదివాసులు ఇతర పేదలు సిద్ధం కావాలని అన్నారు. అనేక దశాబ్దాలుగా భూముల హక్కుల కోసం పోడు భూముల రక్షణ కోసం పార్టీ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేశామని భూముల్ని పోరాటాల ద్వారా సాధించుకున్నామని అన్నారు. అయితే ఆదివాసులకు ఇతర పేదలకు పోడు హక్కును కల్పిస్తానన్న కేసీఆర్ ప్రభుత్వం ఓట్లు దండుకొని మోసం చేసిందని అన్నారు. అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీలు నేటికీ నెరవేర్చలేదని అన్నారు. ప్రభుత్వం పట్టాలిచ్చినంత హడావుడి చేస్తుందని పోడు సాగుదారుల నుండి దరఖాస్తులు తీసుకొని సర్వేల పేరుతో కాలయాపన చేస్తుందని అన్నారు. శాటిలైట్ సర్వే చేస్తే పోడు సాగుదారులకు అన్యాయం జరుగుతుందని శాటిలైట్ ద్వారా కాకుండా ఫిజికల్ సర్వే చేయాలని వెంటనే ఇచ్చిన హామీ ప్రకారం పోడు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాయిదాలు పెట్టే పద్ధతి మానుకోవాలని అన్నారు. త్వరలోనే హక్కుపత్రాల సాధన కోసం ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐపీకేఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మడావి అంకుష్‌రావు జిల్లా నాయకులు కుంచపు ఎల్లయ్య, ముష్క శంకర్, అడ్డగట్ల శంకర్, గొనె లచ్చన్న, సుదర్శన్, మచ్చ శ్రీనివాస్, జైతూ కర్ణు భీంరావ్, బదు మోహన్ పాల్గొన్నారు.

కేజీబీవీల్లోని నాన్ టీచింగ్, వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-నిర్మల్

కేజీబీవీల్లో పనిచేస్తున్న నాన్‌టీచింగ్, వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న అన్నారు. ప్రగతిశీల కేజీబీవీ నాన్‌టీచింగ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కేజీబీవీల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్, వర్కర్స్‌కు ఇప్పటికీ కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. వీరికి పీఎఫ్, ఈఎస్ఐ లాంటి ఆరోగ్య, ఉద్యోగ భద్రత పథకాలు అమలు కావడం లేదన్నారు. గత 16 సంవత్సరాలుగా తీవ్ర పనిభారంతో విధులు నిర్వహిస్తూ, అనారోగ్యాలకు గురయ్యారన్నారు. వీరికి ప్రభుత్వం నుండి ఎలాంటి మెడికల్ ఇన్సూరెన్స్, ఆరోగ్య భద్రత లేదన్నారు. కనీస వేతనాలు అమలు కాకపోవడంతో శ్రమదోపిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, కార్మికులకు వేతనాలు పెంచుతూ ప్రభుత్వం ఇచ్చిన జీఓ నెం.60ని కూడా వీరికి అమలు కావడం లేదన్నారు. పని భారం పెరిగినా ఖాళీలు భర్తీ చేయడం లేదన్నారు. కేజీబీవీల్లో పనిచేసే సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగాల్లో వెయిటేజీ ఇవ్వడం లేదన్నారు. కనీస వేతనాల చట్టాన్ని అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే జీఓ నెంబర్ 60ని అమలు చేయాలన్నారు. కేజీబీవీలో పనిచేసిన సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగాల్లో సర్వీస్ వెయిటేజీ ఇవ్వాలన్నారు. ఎక్స్‌పిరియన్స్ సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. కాలేజీలుగా అప్ గ్రేడ్ అయిన కేజీబీవీల్లో కుక్, స్వీపర్, అటెండర్, స్కావేంజర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కంప్యూటర్, ఒకేషనల్ ట్రైనర్లకు ఫుల్ టైం వేతనాలు ఇవ్వాలన్నారు. ఏఎన్ఎంల నైట్ డ్యూటీలను 03 రోజుల నుండి ఒక రోజుకు తగ్గించాలన్నారు. అకౌంటెంట్లకు బదిలీలు చేపట్టాలన్నారు. పదవీ విరమణ చేసిన వారికి గ్రాట్యుటీ చెల్లించాలన్నారు. చనిపోయిన వారి కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు రూప, జిల్లా కార్యదర్శి కవిత, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి లక్ష్మీ పాల్గొన్నారు.

మొక్కలు నాటడం జీవన విధానంలో భాగం కావాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం జీవనవిధానంలో ఒక భాగం కావాలని విద్యార్థి నాయకులు కాంబ్లె ప్రజ్ఞశీల్, దుర్వ మహేష్, స్వామి కొల్లూరి, కళ్యాణ్ రాథోడ్, జాడి వెంకటేష్ అన్నారు. బుధవారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కోటి వృక్షాల మహోత్సవంలో భాగంగా తెలంగాణలో పచ్చదనం పెంచడమే లక్ష్యంగా మొక్కలు నాటే కార్యక్రమంలో బీఆర్ఎస్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో స్థానిక లిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో మొక్కలను నాటి నీటిని పోశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న హరితహారంలో భాగంగా మొక్కలను నాటే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. అడవుల శాతంను పెంచే విధంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని మొక్కలు నాటి వాటి సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ నైజో సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

మర్రి చెట్టు సన్నిధిలో మెస్రం వంశీయులు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఇంద్రాదేవికి పూజల అనంతరం గంగాజలంతో వచ్చిన మెస్రం వంశీయులు వారి కుటుంబ సభ్యులతో బండేనక బండి కట్టి కేస్లాపూర్ లోని మర్రి చెట్టు వద్దకు చేరుకున్నారు. దినమంతా మర్రిచెట్టు సన్నిధిలో సెదతీరారు. పూజకు ఉపయోగించే సామాగ్రిని వెదురు గుల్లలో పెట్టి ఒక చోటికి భద్ర పరిచారు. వారి సాంప్రదాయ వాయిద్యాలైన కాలికోమ్, పెప్రె, డోలును ఒక చోటికి భద్ర పరిచారు. బుధవారం రాత్రి మెస్రం వంశీయులు పీఠాధపతి మెస్రం వెంకట్‌రావ్‌తో పాటు వారి సతీమణులు కాగాడాలను వెలిగించి సాంప్రదాయ వాయిద్యాలతో మర్రిచెట్టు సన్నిధిలో ఆహ్వానం పలికారు. నాగోబా చరితపై ప్రధాన్‌ల ఆధ్వర్యంలో కచేరీ (చరిత్ర)ని నిర్వహించారు. ఈ రోజు నుంచి గ్రామ పటేళ్ల నాగోబా పూజ అయ్యే వరకు మెస్రం వంశీయులకు అధికారికంగా ఆహ్వానం పలికినట్లు వారి సాంప్రదాయం

కార్యకర్తకు పరామర్శ



నవతెలంగాణ-ఇచ్చోడ

మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త ముస్లే అశోక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి, చికిత్స అనంతరం ఇంటికి వచ్చిన విషయాన్ని తెలుసుకొని బుధవారం నర్సాపూర్ గ్రామంలో గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్, స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. రోడ్డు ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. తొందరగా కొలుకోవాలని కోరుకున్నారు. వారి వెంట బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మాధవ్‌రావు ఆమ్టే, మండల అధ్యక్షులు కేంద్రే నారాయణ, సీనియర్ నాయకులు బాబరావు పటేల్, పోశెట్టి ఉన్నారు.

నాగోబా దేవాలయ చైర్మెన్‌గా మెస్రం తుకారాం ప్రమాణ స్వీకారం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

నాగోబా ఆలయ నూతన చైర్మెన్‌గా మెస్రం తుకారాం బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పదవి కట్టబెట్టినందుకు మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ ఎంపీ గోడం నగేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగోబా ఆశీర్వాదంతో దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ ప్రమాణ స్వీకారానికి మెస్రం వంశీయులు పటేల్ వెంకట్ రావ్, ప్రధాన్‌జీలు దాదేరావ్, తిరుపతి, పూజారిలు కోసు, ధర్ము, హన్మంతు, ఉద్యోగ సంఘం నాయకులు మెస్రం మనోహర్, శేఖర్, దేవ్‌రావ్ పాల్గొన్నారు.

అరులైన ప్రతి విద్యార్థి దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-ఇచ్చోడ

మండల కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలలో ప్రవేశాలకు అరులైన ప్రతి విద్యార్థి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ యునుస్ సలీం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 40 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఈనెల 31లోపు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

పెరటి కోళ్ల పెంపకంతో ఉపాధి

నవతెలంగాణ-భీమారం

పెరటి కోళ్ళ పెంపకంతో గృహిణిలు ఉపాధి పొందవచ్చుని మండల పశు వైద్య అధికారి రాకేష్ శర్మ అన్నారు. బుధవారం మండలంలో 9 మందికి మంజూరైన రాజశ్రీ జాతికి చెందిన కోళ్ళ యూనిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేపడుతున్న ఈ కోళ్ళను సబ్సిడీపై అందజేస్తున్నట్లు వివరించారు. యూనిట్ కు 25 పిల్లలు ఉండే యూనిట్ కాస్టు రూ.1850 ఉండగా రాయితీపై రూ.600కే అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ రాజశ్రీ జాతికి చెందిన కోళ్ళలో రోగ నిరోధక శక్తి అధికంగా ఉండటంతో పాటు 30 శాతం వీటిలో ఎదుగుదల అధికంగా ఉంటుందని తెలిపారు. వీటిని పెంచడం వలన గృహిణీలు లాభదాయకమైన ఉపాధి పొందవచ్చుని తెలిపారు. కార్యక్రమంలో నర్సింగాపూర్ సర్పంచ్ మల్లేష్ పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్‌లో దొంగతనం

నవతెలంగాణ-లక్షెట్టిపేట్

పట్టణంలోని ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతి గృహంలో మంగళవారం రాత్రి దొంగతనం జరిగినట్టు ఎస్సై లక్ష్మణ్ బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం, సంక్రాతి పండుగ సందర్భంగా వసతి గృహానికి సెలవులు ప్రకటించడంతో ఎవరూ లేని సమయంలో దొంగతనం జరిగి ఉండవచ్చున్నారు. వసతి గృహంలో తాళాలు పగులగొట్టి సీసీ కెమెరాల హార్డ్ డిస్క్ ఫుటేజ్‌ను దొంగిలించారు. ఇదే వసతి గృహంలో ఇప్పటికే రెండు సార్లు దొంగతనం జరుగగా జిల్లా అధికారుల సూచనతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ దొంగలు హార్డ్ డిస్క్ ఫుటేజీని ఎత్తుకుపోవడంతో దొంగతనం మిస్టరీగా మారింది. జిల్లా సహాయ సాంఘిక సంక్షేమాధికారి రవీందర్ గౌడ్, వసతి గృహ సంక్షేమాధికారిణి తిరుమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై పేర్కొన్నారు.

ఆర్‌కేసీహెచ్‌పీ గనిని తనిఖీ చేసిన కార్పొరేట్ ఇన్‌స్పెక్షన్ బృందం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



ఆర్‌కేసీహెచ్‌పీ గనిని కార్పొరేట్ ఇన్‌స్పెక్షన్ బృందం బుధవారం తనిఖీ చేసింది. సీహెచ్‌పీ ఆవరణలోని యంత్రాలను, బంకర్లు, క్రష్షర్, గాంట్రీలు అండర్ గ్రౌండ్ బంకర్ యార్డు, ఇంటర్నల్ రోడ్, మెరిట్ యూనిట్, కన్వేయర్ బెల్టులను క్షుణ్ణంగా పరిశీలించి రికార్డులను ఎస్‌ఓపీల ను పరిశీలించి అన్నింటిపై కార్పొరేట్ సూచనలను చేశారు. అనంతరం రక్షణ అధికారి ఓదెలు మాట్లాడుతూ గతంలో కంటే క్లీనింగ్, మెయింటనెన్స్, సేఫ్టీ పై అవగాహన విషయాలలో గని చాలా మెరుగైందని, కార్మికులు 100 శాతం పీపీకిట్, రేడియం జాకెట్ మెయింటెన్ చేయడం శుభసూచకమని అన్నారు. కార్యక్రమం ఎస్‌ఓటూ జీఎం కృష్ణారావు ఏఎస్‌ఓ ఓదెలు ఇన్‌స్పెక్షన్ బందం సభ్యులు సోమయాజులు, కార్పోరేట్ డీజీఎం (ఈ అండ్ ఎం) సేఫ్టీ గాబ్రియెల్ రాజు, ఎస్‌ఈ. కార్పోరేట్ రాజు (ఈఈ) ఆర్ 1ఏ శ్రీధర్ రావు, డీజీఎం బాలాజీ భగవతి ఝా, డీవైఎస్‌ఈ ఏ.చంద్రమౌళి, వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాస్, పిట్ సెక్రటరీ శంకర్ రావు, సూపర్ వైజర్స్ గంగాధర్, కళ్లెపల్లి శ్రీనివాస్, జె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కంటి వెలుగు ఏర్పాట్ల పర్యవేక్షణ

నవతెలంగాణ-తాండూర్

మండలంలోని కాసిపేట్, గోపాల్ నగర్ పంచాయతీలలో కంటి వెలుగు కార్యక్రమం ఏర్పాట్లను స్పెషల్ ఆఫీసర్ గజానంద్ ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, వైద్యాధికారి కుమారస్వామి బుధవారం పరిశీలించారు. పంచాయితీలలోని అన్ని గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమం ఏర్పాట్లు చురుగ్గా జరగాలని సూచించారు. ప్రతి గడపకు కంటి వెలుగు ఇన్విటేషన్ కార్డు అందేలా పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలన్నారు. ఆశా కార్యకర్తలు అంగన్వాడీ టీచర్లు కంటి వెలుగు కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం చేసి కార్యక్రమం విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో గోపాల్ నగర్ పంచాయతీ కార్యదర్శి వసంత, కాసిపేట పంచాయతీ కార్యదర్శి సాయి పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట మండల కేంద్రంలో బుధవారం మున్నూరు కాపు సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను మున్నూరుకాపు సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. ఈ నెల 29న కాసిపేట మండల మున్నూరుకాపు సంఘం సమావేశం నిర్వహించి అనంతరం నూతన కమిటీ ఎన్నిక నిర్వహించేందుకు తీర్మానం చేశారు. ఈ మేరకు సమావేశ నిర్వాహణ కోసం హడక్ కమిటీ ఏర్పాటు చేసి అగ్గు శ్రీనివాస్, అగ్గి సత్తయ్య, మడిపల్లి తిరుపతి, సూరం వెంకటస్వామి, చింతల భీమయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమగూడెంలో ఈ నెల 29న నిర్వహించే మండల కమిటీ సమావేశం, నూతన కమిటీ ఎన్నికకు మున్నూరుకాపులు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం నాయకులు రౌతు సత్తయ్య, భారతాని సతీష్, ఉస్కమల్ల గోపాల్, కుక్కుడపు ప్రకాష్, పానగంటి తిరుపతి, గుర్రాల వేణు, పెద్దపల్లి శంకర్, మచ్చ పోశం, కుక్కుడపు ప్రతాప్, ఆకుల పోశం, సిద్ధం శంకర్, పానగంటి సంపత్, కొమ్ము సతీష్ పాల్గొన్నారు.

కవ్వాల్ టైగర్ జోన్‌పై ట్రైనీ ఎఫ్ఆర్‌ఓలకు అవగాహన

నవతెలంగాణ-జన్నారం

గుజరాత్, జమ్మూ, లడక్, నుంచి వచ్చిన ట్రైనీ ఎఫ్ఆర్‌ఓలకు బుధవారం జన్నారం ఎఫ్డీఓ మాధవరావు కవ్వాల్ టైగర్ జోన్‌పై అవగాహన కల్పించారు. ట్రైనీ ఎఫ్ఆర్ఓ లను గొండుగుడ అడవుల్లో ఉన్న గ్రాస్ ప్లాంట్లను, సాసర్వేల్, హ్యాబిటేషన్ మూమెంట్, జంతువులు పక్షులు, వాటి కదలికలపై వారికి వివరించామని ఎఫ్‌డీఓ మాధవరావు తెలిపారు. 9వ బ్యాచ్‌కు చెందిన, గుజరాత్ నుంచి 42, జమ్మూ నుంచి నలుగురు, లడక్ నుంచి ఒక్కరు చొప్పున ట్రైనీ ఎఫ్ఆర్‌ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జన్నారం ఎఫ్ఆర్‌ఓ ఆఫీస్ ఉద్దీన్ పాల్గొన్నారు.

సోనాపూర్ యువకులకు క్రికెట్ కిట్స్ పంపిణీ

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిదిలోని సోనాపూర్ గ్రామ యువతకు కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా దేవాపూర్ ఎస్సై విజయేందర్ క్రికెట్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పోలీసులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, మీ భద్రత మా బాధ్యతన్నారు. యువత చెడు మార్గాలు నడవకుండా క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని, క్రీడలు మానసిక ఉల్లాసం కలిగిస్తాయి అని, భవిష్యత్తులో క్రీడలతో స్పోర్ట్స్ కోటాతో ఉద్యోగాలకు అవకాశం ఉంటుందన్నారు. అసాంఘిక శక్తుల గురించిన ఎటువంటి సమాచారమైనా పోలీసులకు అందించాలని సూచించారు.

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-కౌటాల

మండలంలోని తాటినగర్ గ్రామానికి చెందిన కొట్రంగి భీంరావు గత కొంతకాలంగా అనారోగ్యంతో మరణించడంతో ఆయన కుటుంబానికి మాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదె వసంత్‌రావు ఆధ్వర్యంలో రూ.9100 ఆర్థిక సాయంగా మృతుడి కుటుంబసభ్యులకు అందజేశారు. ఆ యన వెంట నికోడె హన్మంతు, సెండె నాందేవ్, మోర్లె రాము, మోర్లె పాండురంగ్, కావుడె నందయ్య, కొట్రంగి లక్ష్మణ్, నికోడె బాపురావు, ఆదె పోచయ్య, కొట్రంగి అశోక్, సెండె నీలయ్య ఉన్నారు.

పద్మశాలి విద్యార్థులకు గ్రూప్-1 మెయిన్స్ కోచింగ్

నవతెలంగాణ-హాజీపూర్

పేద పద్మశాలి విద్యార్థులకు గ్రూప్-1 మెయిన్స్ ఉచిత కోచింగ్, ఉచిత భోజన హాస్టల్ సౌకర్యం కల్పించనున్నట్లు తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు ఎనగండ్ల రాహుల్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రూప్-1 సర్వీసెస్ ప్రిలి మినరీ ఎగ్జామినేషన్ ఫలితాలలో ఉత్తీర్ణులైన పద్మశాలి అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిభావంతులైన పద్మశాలి పేద విద్యార్థులకు మెయిన్స్ కోచింగ్, ఉచిత భోజన వసతి పద్మశాలి దాతలచే కల్పిస్తామని తెలిపారు. కావున పేద పద్మశాలి ప్రతిభావంతులు గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో ఉతీర్ణులైన వారు, వివరాలతో 8555002354 నెంబర్‌కు సంప్రదించాలని రాహుల్ కుమార్ కోరారు.

ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



నస్పూర్ లో..

పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్‌లో దివంగత నందమూరి తారక రామారావు 27వ వర్ధంతిని టీడీపీ ఆదిలాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు గుల్లపల్లి ఆనంద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మ గౌరవం కోసం టీడీపీని స్థాపించారన్నారు. అట్టడుగు ప్రజానీకాన్ని ఆదుకోవాలన్న ఉద్దేశంతో పార్టీని స్థాపించి 9 నెలల్లోనే అధికారం చేపట్టి అనేక సంస్కరణలు తెచ్చి, తెలంగాణలో పటేల్ పట్వారి వ్యవస్థ రద్దుచేసి గిరిజనుల కోసం ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటు చేసిన మహనీయుడని అన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి పి.సురేష్ కుమార్, జిల్లా నాయకులు తిరుపతి గౌడ్ , దేవేందర్, మధుకర్, గులాబ్ రావు, సంతోష్, మాజీ కౌన్సిలర్ గుల్లపల్లి లావణ్య, సౌభాగ్యవతి పాల్గొన్నారు.

నస్పూర్ : మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాంపూర్ ఏరియాలో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతిని టీడీపీ మండలాధ్యక్షుడు తలారి రాజు, టీఎన్‌జీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కుంచె భూపతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ మాజీ మంత్రి బోడ జనార్ధన్, మాజీ ఎమ్మెల్యేలు శ్రీదేవి, సోత్కు సంజీవరావు, మంచిర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ ముఖేష్ గౌడ్ అతిథులుగా పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో బీసీలకు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బడుగు బలహీన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పెద్దపల్లి తిరుపతి, సింగతి మురళి, బొడ్డు తిరుపతి, జిల్లా నాయకురాలు కొయ్యాడ పద్మ, టీఎన్‌టీయూసీ ఏరియా వైస్ ప్రెసిడెంట్ రఘుపతి, టీడీపీ సీనియర్ నాయకులు పెద్దపల్లి శంకర్, కొట్ల సత్యనారాయణ, సంకూరి భూమన్న, రాజు పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌లో..

ఆసిఫాబాద్ : టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు 27వ వర్ధంతిని జిల్లా కేంద్రంలో ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. టీడీపీ కోఆర్డినేటర్ పెరుగు ఆత్మరామ్ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఆదిలాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు ఆనంద్‌తో కలిసి ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిఎన్‌ఎస్‌ఎఫ్ అధ్యక్షులు పోల్కర్ సాయిరాం, మడవి దౌలత్ కుమార్, రవి పాల్గొన్నారు.

వార్ధా నదిపై వంతెన నిర్మాణానికి సర్వే

నవతెలంగాణ-కౌటాల

- సర్వే చేసి రిపోర్టు పంపాలని సీఎంఓ ఆదేశం
- స్థలాన్ని పరిశీలించిన ఆర్ అండ్ బీ అధికారులు



తెలంగాణ, మహారాష్ట్ర మధ్య వార్ధా నదిపై వంతెన నిర్మాణానికి ఆర్ అండ్ బీ అధికారులు బుధవారంసర్వే నిర్వహించారు. గతంలో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అసెంబ్లీ సమావేశంలో మండలంలోని గుండాయిపేట్ వద్ద వార్ధా నదిపై వంతెన నిర్మాణం చేపడితే రవాణా సౌకర్యం ఏర్పడుతుందని అసెంబ్లీలో ప్రతిపాదించగా దీనిపై సీఎం స్పందించి వంతెన నిర్మాణం కోసం గతంలో స్థలం పరిశీలించారు. సీఎంఓ కార్యాలయం నుండి ఆర్ అండ్ బీ అధికారులకు వంతెన నిర్మాణానికి స్థలం అనుకూలంగా ఉంటుందా.. లేదా.. అని స్పష్టత కోరింది. దీంతో ఆర్ అండ్ బీ అధికారులు బి.లక్ష్మీనారాయణ, ఏఈ రవికిరణ్ ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్యతో కలిసి నది పరివాహక ప్రాంతాన్ని పరిశీలించారు. తెలంగాణ సరిహద్దు ప్రాంతం నుంచి మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన చంద్రాపూర్ జిల్లా రాజూరా తాలుకాలోని నది వద్ద నదీ సరిహద్దు ప్రాంతం వరకు నాటుపడవలో వెళ్లి పరిశీలించారు. నది వెడల్పు 750 మీటర్ల వరకు ఉండే అవకాశముందని, పూర్తి సర్వే వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. వంతెన నిర్మాణానికి సుమారుగా రూ.70 కోట్ల వరకు అంచనా వ్యయం ఉంటుందని ప్రాథమికంగా అధికారులు అంచనా వేశారు. నీటి లోతు, ప్రతిరోజు నాటుపడవ ద్వారా ఎంతమంది నది దాటి వెళ న్నారనే విషయాన్ని నమోదు చేసుకున్నారు. వారితో పాటు ప్రజా ప్రతినిధులు కూడా నదీ పరివాహక ప్రాంతాన్ని పరిశీలించడంతో వార్ధా నదిపై త్వరలోనే వంతెన నిర్మాణం చేపడతారని స్థానికుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. నదిని పరిశీలించిన వారిలో ఉప సర్పంచ్ చాప్లె లాంచు, బీఆర్ఎస్ నాయకులు సంతోష్, ప్రేమ్‌లాల్, ప్రకాష్, తుకారాం ఉన్నారు.

రాష్ట్ర 7వ మహాసభలు విజయవంతం చేయండి

నవతెలంగాణ-నస్పూర్



సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) కొత్తగూడెంలో ఈ నెల 29వ తేదీన నిర్వహిస్తున్న ఏడవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ఐఎఫ్‌టీయూ గౌరవ అధ్యక్షుడు టి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న కార్మికులను పర్మనెంట్ కార్మికులతో సమానంగా కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్న కూడా గుర్తింపు పొందడం లేదని ఆరోపించారు. ఏడవ వేతన ఒప్పందం నుండి కాంట్రాక్ట్ కార్మికులకు వేతన ఒప్పందం అమలు చేయాలని పోరాడుతున్న సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులకు వేతన ఒప్పందం అమలు కావడం లేదని విమర్శించారు. 30 శాతం పీఆర్సీ వేతనాలు, ప్రమాదంలో చనిపోతే రూ.30 లక్షల నష్టపరిహారం ఇస్తామని అందుకు కొంత సమయం ఇవ్వమని యాజమాన్యం రాతపూర్వకంగా ఒప్పందం చేసి, 18 రోజులు సమ్మె చేసిన ఈ డిమాండ్లను పరిష్కరించలేదని అన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల రక్తాన్ని పిండి లాభాలర్జిస్తూ శ్రమదోపిడి చేసి సింగరేణి అవార్డులు రివార్డులు తీసుకుంటుందని పేర్కొన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు 11వ వేతన ఒప్పందం చేయడంలో జాతీయ సంఘాలు విఫలమయ్యాయని, ఇది కాంట్రాక్ట్ కార్మికులను మోసం చేయడమే అని విమర్శించారు. మిలిటెంట్ ఐక్య నిరవధిక పోరాటంతోనే కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ కాంట్రాక్టర్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు డి.బ్రహ్మానందం పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష



నవతెలంగాణ-రెబ్బెన

ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఎంపీపీ జుమ్మిడి సౌదర్య బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక సెక్రటరీ సమయపాలన పాటించాలని, ప్రభుత్వ స్థలాల్లో ఎలాంటి అనుమతి ఇవ్వరాదన్నారు. అదేవిధంగా ప్రభుత్వ స్థలంలో ఆక్రమించి ఇల్లు కట్టుకొనే వారికి ఎలాంటి అనుమతి ఇవ్వరాదన్నారు. గ్రామాల్లో అందుబాటులో ఉండి వార్డుల్లో పరిశుభ్రంగా ఉండేవిధంగా ప్రతి ఒక సెక్రటరీ చూడాలన్నారు. ప్రతిరోజు గ్రామాల్లో, వార్డుల్లో శానిటేషన్ పనులు చేస్తుండాలని, ఎప్పటికప్పుడు రోడ్లపై చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అదేవిధంగా కంటి వెలుగు పథకం ప్రతి గ్రామంలో ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించి ఈ పథకాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణసింగ్, ఎంపీఓ అఫ్జల్‌పాషా, సెక్రటరీలు పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పెంపకంతో అధిక లాబాలు

నవతెలంగాణ-జన్నారం

పెరటికోళ్ల పెంపకంతో రైతులకు అధిక లాభాలు పొందవచ్చని జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, మండల పశువైద్యాధికారి డా.శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులకు ప్రభుత్వం ద్వారా 75 శాతం సబ్సిడీపై వచ్చిన కోడి పిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు అదనపు ఆదాయం చేకూరాలని, ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు కోడి పిల్లలను పంపిణీ చేస్తుందన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 15 మంది రైతులకు 15 యూనిట్ల కోడి పిల్లలను పంపిణీ మొదటి విడతగా పంపిణీ చేశామన్నారు. ఒకొక్క యూనిట్‌కు 25 పిల్లలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ గోట్ల రాజేష్ యాదవ్, టీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సులువ జనార్ధన్, బీవీఎస్ నాయక్, పశువైద్య సిబ్బంది డాక్టర్ కిరణ్, శిరీష సాగర్ పాల్గొన్నారు.



ప్రజా సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-నస్పూర్

ప్రజా సమస్యలను త్వరిగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ రాహుల్ ఆదేశించారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని వినూత్న కాలనిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వార్డులోని ప్రజలను కాలనీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మురుగు కాలువలు, సీసీ రోడ్ల సమస్య ఉందని తెలుపగా సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించాలని కమిషనర్ రమేష్, మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్‌కు తెలిపారు. అనంతరం డబ్బు యాడ్ కొరకు స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో ఏఈ మధు పాల్గొన్నారు.

23న మున్నూరుకాపు సంఘం ఎన్నికలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మున్నూరుకాపు సంగం జిల్లా కార్యవర్గం ఎన్నిక ఈ నెల 23 న సోమవారం జరగనున్నట్లు ఆ సంఘం జిల్లా యువజన అధ్యక్షుడు గడ్డల సురేష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్నూరుకాపు సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నికలు ఈ నెల23న సోమవారం జిల్లా కేంద్రంలోని మున్నూరుకాపు సంఘం స్థలంలో ఉదయం 11 గంటలకు(తెలంగాణ ఆదర్శ పాఠశాల ప్రక్కన)జరుగుతాయని ఈ ఎన్నికలకు జిల్లాలోని అన్ని మండలాల నుంచి మున్నూరుకాపు ప్రజలు పాల్గొనాలని కోరారు.

బృహత్ పల్లె ప్రకృతి వనాలను త్వరితగతిన పూర్తి చేయాలి

నవతెలంగాణ-కాసిపేట

బృహత్ పల్లె ప్రకృతి వనాలను త్వరతగతిన స్థలాలను గుర్తించి, మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్లు మధుసూదన్ నాయక్, రాహుల్ పేర్కొన్నారు. బుధవారం కాసిపేట మండలంలోని ముత్యంపల్లిలోని కాసిపేట గని సమీపంలోని సింగరేణి స్థలాన్ని సింగరేణి, రెవెన్యూ, మండల పరిషత్తు అధికారులుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థలాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్ కుమార్, ఎంపీడీఓ ఎంఏ అలీం, ఎంపీఓ నాగరాజు, ఉప సర్పంచులు బోయిని తిరుపతి, పిట్టల సుమన్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి పటిష్ట చర్యలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆలయ అభివృద్ధికి ప్రతిష్ట చర్యలు తీసుకుంటున్నట్టు ఎండోమెంట్ అధికారి రవీందర్ తెలిపారు. మండలంలోని చిర్రకుంట గ్రామంలో ఆలయానికి ముఖ ద్వారం నిర్మాణానికి ఎంపీపీ మల్లికార్జున్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఇప్పటికే ఆలయం ధూప దీప నైవేద్య పథకం పరిధిలో ఉందని అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు కేటాయించి ఆలయ అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు.

మైనార్టీ గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

మైనార్టీ గురుకులాల్లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఎండబ్ల్యూఓ మహెమూద్, ఆర్ఎల్‌సీ శ్రీధర్, విజిలెన్స్ అధికారి తాహిరుద్దిన్‌లు తెలిపారు. కాగజ్‌నగర్ గురుకులంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఈ నెల 17 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించామని, 30 వరకు స్వీకరిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు గురుకులాల్లో సంప్రదించాలని పేర్కొన్నారు.

క్రీడా ప్రాంగణాల పనులు చేపట్టాలి

నవతెలంగాణ-తాండూర్

నిలిచిపోయిన పల్లె ప్రకృతి క్రీడా ప్రాంగణాల పనులను త్వరితగతిన చేపట్టాలని అదనపు కలెక్టర్లు మధుసూదన్ నాయక్, రాహుల్ సూచించారు. బుధవారం మండలంల పంచాయితీ, రెవెన్యూ అధికారులతో మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీలో ప్రజల సౌకర్యార్థం పల్లె ప్రకృతి వనాలు, క్రీడా మైదానాల నిర్మాణాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. వివాదస్పద స్థలాల క్రీడామైదానాలు పల్లె ప్రకృతి వనాల సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ మండల పరిషత్ అధికారులు సమన్వయంతో పరిష్కరించాలన్నారు. తాండూర్, రాజీవ్‌నగర్, కిష్టంపేట, కాసిపేట, పంచాయితీలలోని పల్లె ప్రకృతి వనాలు క్రీడా మైదానాలవిషయమై ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ తాహసీల్దార్ కవితను అడిగి తెలుసుకున్నారు. అసంపూర్తిగా ఉన్న పల్లె ప్రకృతి వానాల వివరాలను, కారణాలను పంచాయితీ కార్యదర్శుల ద్వారా తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాజీవ్‌నగర్ సర్పంచ్ క్రిస్టఫర్ పంచాయతీ సెక్రెటరీలు కల్పన, తాపస్‌కుమార్, చంద్రమౌళి, సురేష్ కుమార్, సాయి పాల్గొన్నారు.

'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రమేష్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మొదలుపెట్టిన కంటి వెలుగు కార్యక్రమం గురువారం నుంచి ప్రారంభమవుతుందని ఆయన అన్నారు. నస్పూర్‌లో కంటి వెలుగు సెంటర్‌ను మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్‌తో కలిసి సందర్శించారు. ప్రతి ఒక్కరూ డాక్టర్ (ఆప్తాల్మిక్)పరీక్షలు చేసుకోవాలని, పరీక్షలకు వచ్చే వారికి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. వార్డు అధికారి, ఆర్పీలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతి ఇంటికి సర్వే చేసి, వివరాలు సేకరించి ప్రతి ఒక్కరూ కంటి వెలుగులో పరీక్షించుకునేలా చూస్తారని పేర్కొన్నారు.

భీమారం : ప్రభుత్వం ప్రవేశపెడుతున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని మండల ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాస్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి ప్రరంభం అయ్యే ఈ ఉచిత కంటి పరిక్షా శిబిరంలో పాల్గొని, ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్‌పై అవగాహన

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా వర్క్‌షాప్ ఆవరణలో ఏరియా స్టోర్, వర్క్‌షాపులో పనిచేసే ఉద్యోగులకు సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ అమలుపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌ఓటు జీఎం కెహెచ్‌ఎన్ గుప్తా మాట్లాడుతూ సింగరేణిని ప్రమాదాలు లేని సంస్థగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలన్నారు. ప్రమాదాలకు మూలకారణం మానవ తప్పిదాలని, వాటిని నియంత్రించడానికి రక్షణ సూత్రాలు పాటిస్తూ పరికరాలను ధరించాలని, అదేవిధంగా కాళ్లకు షుఉలు, తలకు హెల్మెట్ ప్రతి ఒక ఉద్యోగి ఖచ్చితంగా ధరించి పనులు చేయాలన్నారు. ఎస్ఎంటీటీ ఎస్‌ఓఎం ఈవీఎన్ విజయ్‌కుమార్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ అమలుపై ఉద్యోగులకు ప్రొజెక్టర్(పవర్ పాయింట్ ప్రజంటేషన్) ద్వారా రక్షణతో చేసే పనులపై అవగాహన కల్పించారు. అవగాహన లేమి అతివేగంతో ముగించాలనే ఆలోచనతో చేసే పనులు ప్రమాదాలకు కారణమవుతాయన్నారు. కార్యక్రమంలో ఏజీఎం ఎం తిరుమలరావు, డీజీఎం వర్క్‌షాపు కృష్ణమూర్తి, డీజీఎం స్టోర్ శ్రీనివాస్‌రావు, డీపీఓ ఓసీ(2) మేనేజర్ మహేష్‌కుమార్, వెల్ఫేర్ ఆఫీసర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
www.navatelangana.com
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
గురువారం 19 జనవరి 2023

కనకాపూర్‌లో 29న బుద్ధవిహార్ ప్రతిష్టాపన

నవతెలంగాణ - లోకేశ్వరం

ఈ నెల 29న కనకాపూర్ గ్రామంలో బుద్ధ విహార్ ప్రతిష్టాపన మహోత్సవం నిర్వహిస్తున్నామని భారతీయ బౌద్ధ మహ సభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గడపాలే ప్రభాకర్ తెలిపారు. మండల కార్యకర్తలతో కలిసి బుధవారం ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మనవడు భారతీయ బౌద్ధ మహాసభ అధ్యక్షులు డాక్టర్ భీంరావు యశ్వంత్ అంబేద్కర్ ముఖ్యాతిథిగా పాల్గొననున్నట్లు తెలిపారు. మండలంతో పాటు ఆయా గ్రామాల నుంచి బౌద్ధ ఉపాసకులు, యువకులు భారీ సంఖ్యలో హాజరై భగవాన్ బుద్ధ మూర్తి ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంస్కార విభాగ్ ఉపాధ్యక్షుడు నారాయణ్ వాఘ్మారే, మండల అధ్యక్షులు, బాపూరావు వాఘ్మారే, మండల ప్రధాన కార్యదర్శి, పవార్ అంబాదాస్, జై భీమ్, భద్రే సాయినాథ్, దిలీప్ వాఘ్మారే తోండాల, పవార్ గౌతమ్ జవుల (కే) పవార్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్‌పై అపోహలు వద్దు : గండ్రత్ ఈశ్వర్

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ మున్సిపల్ మాస్టర్ ప్లాన్ విషయంలో రైతులు ఎలాంటి అపోహలు, ఆందోళనలకు గురికావద్దని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. స్థానిక బంగల్ పేట్ వద్ద రైతులతో కలిసి బుధవారం వ్యవసాయ పొలాలను పరిశీలించారు. రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి రైతులకు అండగా ఉంటారని, ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. విశ్వనాథ్‌పేట్ నుండి నూతన కలెక్టరేట్ వరకు 100 ఫీట్ల రోడ్డు కేవలం ప్రతిపాదన మాత్రమే ఉందన్నారు. మాస్టర్ ప్లాన్ ఆమోదం పొందలేదని ప్రస్తుతం ఉన్న 80 ఫీట్ల రోడ్డును యధావిధిగా కొనసాగుతుందని తెలిపారు. ఎవరినీ ఇబ్బంది పెట్టి అభివృద్ధి పనులు చేయాలనుకోవడం లేదని స్పష్టం చేశారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. చైర్మన్ వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, కౌన్సిలర్‌లు ఉన్నారు.

అడ్డగోలుగా ఎస్పీఎం వ్యవహారం

- తమ స్థలాల పేరిట రహదారులపై గోడల నిర్మాణం
- ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్న యాజమాన్యం
- ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత

స్థానికులకు ఉపాధి కల్పిస్తామని, ప్రజా సంక్షేమానికి పాటు పడతామని కట్టుకథలు చెప్పి రాష్ట్ర ప్రభుత్వం నుండి రాయితీలు పొందిన సిర్పూరు పేపర్ మిల్లు యాజమాన్యం వీటన్నింటినీ విస్మరించి కేవలం తన ఆస్థులను కాపాడుకునే పనిలో పడింది. దశాబ్దాల కాలంగా ప్రజలు రాకపోకలు సాగించే రహదారులన్నింటినీ తన ఆస్థులుగా పేర్కొంటూ వాటిపై అడ్డుగోడలు నిర్మిస్తూ పోతోంది. ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత వస్తున్నా యాజమాన్యం మొండిగా ముందుకు వెళుతుండడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు పేపర్ మిల్లు 2018, ఆగష్టు నెలలో పున:ప్రారంభమైంది. అప్పటి నుండి స్థానికుల కష్టాలు కూడా మొదలయ్యాయి. జేకే యాజమాన్యం ఈ మిల్లును టేకోవర్ చేసుకున్న నాటి నుండి తన ఆస్తులను కాపాడుకోవడానికి ఇచ్చే ప్రాధాన్యత స్థానికుల సంక్షేమానికి ఇవ్వడం లేదు. దీనికి ముందు ఉన్న యాజమాన్యం తన మిల్లును పరిరక్షించుకుంటూనే మరోవైపు పట్టణ ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిచ్చింది. స్థానిక రాజకీయాలు ఒకవైపు, మిల్లులో నష్టాలు మరోవైపు కారణాలతో పాత యాజమాన్యం ఈమిల్లును 2014, సెప్టెంబర్ 27న షట్‌డౌన్ పేరిట మూసివేసిన విషయం తెల్సిందే. నూతన యాజమాన్యం గత రెండేళ్లగా పట్టణంలోని ప్రధాన రహదారులను మూసివేస్తూ వస్తోంది. స్థానికులు ప్రశ్నిస్తే తమ ఆస్తులలో తాము ఏమైనా చేసుకుంటామని, అడగడానికి మీరెవరంటూ దబాయించి మరీ అడ్డుగోడల నిర్మాణం చేపడుతోంది. ఇందులో భాగంగానే ఈ నెల 16న స్థానిక ఓల్డ్‌కాలనీకి వెళ్లే రహదారిని మూసివేసేందుకు ఎస్పీఎం ప్రతినిధులు వెళ్లగా స్థానికులు అడ్డుకున్న విషయం తెల్సిందే. దీనికి ముందు స్థానిక ఈఎస్‌ఐ ట్యాంక్ వద్ద, ఎస్పీఎం క్రీడా మైదానం వద్ద ప్రధాన రహదారులను యాజమాన్యం గోడలు నిర్మించి మరీ మూసివేసింది. అప్పట్లో స్థానికుల నుండి తీవ్ర వ్యతిరేకత వచ్చిన యాజమాన్యం మొండిగా వీటి నిర్మాణం చేపట్టింది. స్థానిక ఎమ్మెల్యేతో పాటు అధికారులు కూడా యాజమాన్య వైఖరిని వ్యతిరేకించకపోవడంతో వారిదే ఇష్టారాజ్యంగా మారింది. ఇపుడు మళ్లీ ప్రజలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారులపై అడ్డుగోడల నిర్మాణానికి యాజమాన్యం శ్రీకారం చుట్టింది.

అడ్డుగోడల నిర్మాణంతో ట్రాఫిక్ సమస్యలు

ఈఎస్‌ఐ ట్యాంక్ వద్ద గోడ నిర్మాణంతో ఎన్టీఆర్ చౌక్ నుండి రాజీవ్ చౌక్ వరకు ఉన్న ప్రధాన రహదారిపై విపరీతంగా ట్రాఫిక్ పెరిగింది. గోడ నిర్మాణానికి ముందు కొంత ట్రాఫిక్ ఎస్పీఎం క్వార్టర్ల గుండా లారీ చౌక్ వరకు మళ్లింపు జరిగేది. గోడ నిర్మాణంతో ట్రాఫిక్ మొత్తం ప్రధాన రహదారి గుండానే ప్రయాణిస్తుండడంతో విపరీతంగా ట్రాఫిక్ పెరిగి సమస్య ఏర్పడుతోంది. ఈ రోడ్డుకు ఇరువైపులా ఎస్పీఎం క్వార్టర్లే ఉండడం, రోడ్డు ఇరుకుగా ఉండడంతో తరచుగా సమస్యలు ఏర్పడుతున్నాయి. ఎస్పీఎం క్రీడా మైదానం ముందు గోడ నిర్మాణంతో సర్‌సిల్క్, సుభాష్‌చంద్రబోస్ కాలనీ, ఓల్డ్ కాలనీ తదితర వాసులు రైల్వే స్టేషన్‌కు వెళ్లేందుకు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.



గోడ నిర్మాణానికి వచ్చిన అధికారులను అడ్డుకుంటున్న ఓల్డ్‌కాలనీ వాసులు (ఫైల్)



ఈఎస్‌ఐ ట్యాంక్ వద్ద రహదారికి అడ్డంగా నిర్మించిన గోడ

ప్రజా సంక్షేమంతో పాటు పన్నుల చెల్లింపేది?

తన ఆస్థుల పేరిట ప్రజల రాకపోకలను బంద్ చేస్తున్న యాజమాన్యం తాను చెల్లించే ఆస్తిపన్ను గురించి మాత్రం మాట్లాడడం లేదు. మున్సిపల్ పరిధిలో ఉన్న మిల్లు, మిల్లు క్వార్టర్లకు సంబంధించిన ఆస్థి పన్నును ప్రతీ ఏటా యాజమాన్యం మున్సిపల్‌కు చెల్లించాలి. ఇది చెల్లించకుండా యాజమాన్యం తమాషా చూస్తున్నా అటు స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ కౌన్సిల్‌తో పాటు అధికారులలో చలనం లేకపోవడం గమనార్హం. ప్రతీ ఏడాది మిల్లు యాజమాన్యం రూ. 56 లక్షల ఆస్థి పన్ను చెల్లించాలని ఇటీవల సర్వే నిర్వహించిన పరిశ్రమల శాఖ జీఎం, స్థానిక తహసీల్దార్‌లు నిర్ణయించారు. 2018 నుండి ఇప్పటి వరకు ఏటా రూ. 56 లక్షల చొప్పున చెల్లించాలని నాలుగు రోజుల క్రితమే మున్సిపల్ అధికారులు యాజమాన్యానికి నోటీసు జారీ చేశారు. వాస్తవానికి దీనికి ముందు మున్సిపల్ అధికారులు ఏటా రూ. 80 లక్షల చొప్పున ఆస్థి పన్ను చెల్లించాలని నిర్ణయించగా, దీనికి యాజమాన్యం అభ్యంతరం తెలుపడంతో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్, తహసీల్దార్‌లతో సర్వే నిర్వహించి రూ. 56 లక్షలుగా నిర్ణయించారు. అయినా ఇది కూడా యాజమాన్యం చెల్లించడం లేదు. ఎస్పీఎం కాలనీలలో మాత్రం మున్సిపల్ అధికారులు ప్రభుత్వ ధనంతో రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు. టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ. 30 లక్షలకు పైగా వెచ్చించి అటవీ శాఖ కార్యాలయం ముందు నుండి ఎస్పీఎం క్వార్టర్లకు రోడ్డు నిర్మించారు. అదేవిధంగా టిప్పర్‌లైన్‌లో కూడా మరో రూ. 30 లక్షలకు పైగా నిధులు వెచ్చించి రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇక సంక్షేమం విషయానికి వస్తే పాత యాజమాన్యం అందించే సంక్షేమ కార్యక్రమాలను కూడా ఈ యాజమాన్యం ఒక్కోక్కటిగా తొలగిస్తూ వస్తోంది. స్థానికులకు అందుబాటులో ఉండే క్రీడా మైదానంలోకి పట్టణవాసులను అనుమతించడం లేదు. మిల్లు నుండి వెలువడే వాయు కాలుష్యాన్ని తాము భరిస్తే తమకు యాజమాన్యం సంక్షేమం కల్పించకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గోడల నిర్మాణాలకు అనుమతి లేదు
-అంజయ్య, మున్సిపల్ కమిషనర్

ఎస్పీఎం రహదారులపై నిర్మించే గోడలకు మున్సిపల్ నుండి ఎలాంటి అనుమతి లేదు. గోడల నిర్మాణాలు చేపట్టే అధికారం యాజమాన్యానికి లేదు. ఇప్పటి వరకు నిర్మించిన గోడలను తొలగించాలని కూడా యాజమాన్యానికి సూచించాం. జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా దీన్ని తీసుకెళ్లాం.

కార్యకర్తలతో ఏలేటి ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని పలు గ్రామాలలో కార్యకర్తలు, నాయకులతో బుధవారం మాజీ ఏమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆత్మీయ సమ్మేళనలు నిర్వహించారు. లక్ష్మణచాంద, తిర్పెల్లి, పీచర, ధర్మారం, మల్లాపూర్, గ్రామాల్లో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వారిని పలకరిస్తూ యోగక్షేమాలు తెలుసుకున్నారు. రానున్న ఎన్నికలలో కలిసి కట్టుగా పని చేయాలని సూచించారు. నాయకుల అభిప్రాయాలు, సూచనలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు డి.ముత్యంరెడ్డి, ఉపాధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్, మండల అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు చిన్నయ్య, లక్ష్మణచాంద సర్పంచ్ సురకంటి ముత్యంరెడ్డి, ఎంపీటీసీలు నర్సారెడ్డి, రాజేశ్వర్, నాయకులు సరికెల గంగన్న, తక్కల రమణారెడ్డి, పీచర ముత్యంరెడ్డి, జీవన్‌రెడ్డి, అట్ల రాంరెడ్డి, చెవ్వ రాజేశ్వర్, ఓస రాజు, మోహన్‌రెడ్డి, మల్లాపూర్ సర్పంచ్ ఎ.రవి, శంకర్ పాల్గొన్నారు.

తృటిలో తప్పిన పెను ప్రమాదం

నవతెలంగాణ-గుడిహత్నూర్

మండల కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి తృటిలో ప్రాణాపాయం తప్పింది. బెంగళూర్ నుంచి ఘజియాబాద్‌కు పప్పు లోడుతో వెళుతున్న కంటైనర్ జాతీయ రహదారిపై మేకను తప్పించబోయి సర్వీస్ రోడ్డుపై బోల్తా కొట్టింది. ఈ క్రమంలో సర్వీస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న బొల్లోజీ సురేష్ ఇంటిపై దూసుకెళ్లింది. ఇంటి ప్రహరీ గోడ, విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. గంట పాటు విద్యుత్ సరఫరాను అధికారులు నిలిపివేశారు. ప్రభుత్వ కార్యాలయాలన్ని ఈ సర్వీస్ రోడ్డు వైపు ఉండడంతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రమాద సమయంలో ఎవరూ లేకపోవడంతో ఘోర ప్రమాదం తప్పిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు తెలంగాణ పేరిట బాదుడు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల కుప్పగా మార్చిందని బిజెపి రాష్ట్ర నాయకురాలు చిట్యాల సుహాసినిరెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం ఆమె నివాసంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. కరెంటు చార్జీల పెంపుతో ప్రజలకు కరెంటు షాక్ ఇచ్చేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. గతంలో చిన్నపాటి గుడిసెకు రూ.50 కరెంటు బిల్లు వచ్చేదని, ప్రస్తుతం రూ.1000 వరకు బిల్లు వస్తోందని తెలిపారు. ఇలా ఒక్క కరెంటు చార్జే కాకుండా బస్సు చార్జీలు, ఇంటి పన్నులు, రిజిస్ట్రేషన్ ఫీజులు, నల్ల బిల్లులు ఇలా ఏ దాన్ని చూసినా ప్రజలపై పెనుభారం మోపుతోందని అన్నారు. ట్యాక్స్‌ల రూపంలో పేద ప్రజల నడ్డి విరుస్తోందని మండిపడ్డారు. సమావేశంలో బిజెపి నాయకులు గందే విజయ్ కుమార్, రాము, నవీన్ వర్మ శాంత పాల్గొన్నారు.

టీఎన్జీవో నూతన పట్టణ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-నిర్మల్

టీఎన్జీవో పట్టణ నూతన కమిటీని బుధవారం టీఎన్జీవో సంఘ భవనంలో ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా శ్రీరామ్ శ్రీనివాస్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు వెలుమల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి కూడాల రవికుమార్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షులుగా మెంగ ప్రవీణ్, సెక్రటరీగా బి.శ్రీనివాస్, కోశాధికారిగా టి. శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా ఎ.శ్రీనివాస్, సాయికిరణ్, మహిళా అధ్యక్షురాలిగా శ్రీదేవి, కార్యదర్శిగా బి. శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా అజహర్ హుస్సేన్, ఫణీందర్, జాయింట్ సెక్రటరీగా శ్వేత, పబ్లిసిటీ సెక్రటరీగా సల్ల శ్రీనివాస్, కల్చరల్ సెక్రటరీగా వెంకటరమణ, కార్యవర్గ సభ్యులుగా స్నేహలత, కాజా ఖదీర్ హైమద్, ఎస్.సత్యం, ఎ.సురేందర్‌రెడ్డి, జి.శంకరమ్మ, కె అరుణ్, యం రమేష్ ఎన్నికయ్యారు. అనంతరం సభ్యులను ఘనంగా శాలువాలతో సన్మానించారు.

క్యాన్సర్ వ్యాధితో బాలిక మృతి

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

క్యాన్సర్ మహమ్మారి సోకి బాలిక మృతి చెందిన ఘటన పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే గాంధీనగర్ కాలనీకి చెందిన కొంకటి రాజేశ్వరి(13) గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి రాజమల్లు గత 10 సంవత్సరాల కింద అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా మృతురాలికి తల్లి ముత్తవ్వ, అక్క పోసాని ఉన్నారు. రాజేశ్వరి చిన్న వయసులోనే క్యాన్సర్ బారిన పడి మృతి చేందడంతో కాలనీవాసులు విషాదంలో మునిగిపోయారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ - లోకేశ్వరం

మండలంలోని పుస్పూర్ గ్రామానికి చెందిన లక్ష్మణ్‌గౌడ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తెలంగాణ గౌడ సంఘం సభ్యులు లక్ష్మణ్‌గౌడ్ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నిర్మల్ జిల్లా తెలంగాణ గౌడ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణగౌడ్, సభ్యుల ఆధ్వర్యంలో రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో రాజురా సర్పంచ్ ముత్తాగౌడ్, పుస్పూర్ మాజీ సర్పంచ్ గంగామణి, జిల్లా గౌడ సంఘ ఉపాధ్యక్షులు నెరెల్లా రామాగౌడ్, మాజీ ఎంపీటీసీ కొండ భూమాగౌడ్, కార్యదర్శులు నగేష్ గౌడ్, పవన్‌గౌడ్, లోకేశ్వరం మండల గౌడ సంఘం అధ్యక్షుడు రమేష్‌గౌడ్, స్వామిగౌడ్, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎస్టీపీపీ క్రికెట్ టోర్నీ ప్రారంభం

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి సంస్థకు చెందిన ఎస్టీపీపీ ఆధ్వర్యంలో బుధవారం క్రికెట్ టోర్నమెంట్‌ను సీటీసీ సంజయ్‌కుమార్ సూర్ అట్టహాసంగా ప్రారంభించారు. పది సంవత్సరాలుగా ఆనవాయితీగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల్లో ఈ ఏడాది 10 జట్లు పాల్గొంటున్నట్లు ఎస్టీపీపీ క్రికెట్ లీగ్ 2020-23 చీఫ్ కోఆర్డినేటర్ పంతులా నాయక్ తెలిపారు. ఎస్సార్పీ టీంతో పాటు సింగరేణికి చెందిన 3జట్లు, పవర్‌మేక్ కంపెనీకి చెందిన 3 జట్లు, ప్రైవేట్ సెక్యూరిటీ, పీఈఎస్, ఏఆర్పీ జట్లు ఈ క్రికెట్ టోర్నీలో తలపడనున్నాయని పేర్కొన్నారు. ఎస్టీపీపీ-1 వర్సెస్ పవర్‌మేక్-3 జట్టు శుభారంభంతో క్రికెట్ టోర్నమెంటు ప్రారంభించామని తెలిపారు. ఈ నెల 26తో క్రికెట్ టోర్నీ ముగుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ జీఎం సూర్యనారాయణరావు, చీఫ్ ఆఫ్ ఓఅండ్ఎం జెన్‌సింగ్, శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి, డీజీఎం రవికుమార్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ భవన నిర్మాణం పనుల పరిశీలన

నవతెలంగాణ-నిర్మల్

నూతన సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణం పనులను కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ బుధవారం పరిశీలించారు. అన్ని గదులను తిరుగుతూ నిర్మాణం పనుల నాణ్యాత ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్‌డీఓ స్రవంతి, అర్అండ్‌బీ ఈఈ అశోక్, డీఈ తుకారాం, తహసీల్దార్ సుభాష్ చందర్, సంబంధిత శాఖ అధికారులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణకు బీజేపీ పెద్దలను ఒప్పించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకై కేంద్ర బీజేపీ పెద్దలను ఒప్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఆరేల్లి మల్లేష్ కోరారు. బుధవారం బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డిని ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకై ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గత 28 ఏండ్లుగా ఉద్యమం కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. బీజేపీ మొదటి నుండి ఎమ్మార్పీఎస్ చేస్తున్న పోరాటానికి మద్దతిస్తూ వస్తుందని అన్నారు. తెలుగు నేలపై జరిగిన ప్రతి అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా బీజేపీ ఎన్నికల వాగ్దానాల్లో హామీ ఇస్తూ మాదిగలు నిర్వహించిన ప్రతీ సభలో మద్దతు పలికారని గుర్తు చేశారు. కేంద్రంలో అధికారంలోకి వస్తే కేవలం వంద రోజులలోపే వర్గీకరణ చేస్తామని మాదిగలకు హామీ ఇచ్చారని అలా హామీ ఇచ్చి నేటికీ 8 సంవత్సరాలు గడిచిపోయాయని అసహనం వ్యక్తం చేశారు. నేడు కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండి ఎస్సీ వర్గీకరణపై మౌనం వహించడం బాధాకరమన్నారు. వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టేలా ప్రధానమంత్రి ఆయన మంత్రి మండలిని కలిసి విజ్ఞప్తి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ పలు మండలాల



ఇన్‌ఛార్జిలు, అధ్యక్షులు బరుకుంట సుభాష్, జిల్లాపల్లి నవీన్, చిట్టి రవి, దుబ్బాక చందు, ఈరగొల్ల శ్రీహరి, దర్శనాల జైపాల్, బత్తిని గంగయ్య, ఉప్పులేటి శ్రీను, సింగారపు స్వామి, అరెపెల్లి గణేష్, సుంకే అనిల్, మోదుగు వెంకటేష్, జన్నారపు

ఆదిలాబాద్‌లో ఆక్టోపస్ బలగాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రతిష్టాత్మకంగా ప్రత్యేకంగా దేశద్రోహులను టెర్రరిస్టులను మట్టు పెట్టడానికి నిర్వహించబడుతున్న ఆక్టోపస్ బృందం ఆదిలాబాద్ జిల్లాలోనికి రెండు రోజుల పాటు శిక్షణ నిమిత్తం విచ్చేసిందని జిల్లా ఎస్పీ డి ఉదయ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగానే బుధవారం జైనథ్ మండలం సాత్నాల ప్రాజెక్టు వద్ద ప్రాజెక్టును దేశద్రోహులు టెర్రరిస్టులు స్వాధీనపరచుకుంటే ఎలా నిరువరించాలి అనే అంశంపై ఈ బృందాలు శిక్షణను ఆక్టోపస్ డీఎస్పీ ఎం విజయ్ కుమార్ ఆధ్వర్యంలో విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆక్టోపస్ బృందంలో వివిధ రకాలైన అత్యాధునిక ఆయుధాలను ఉపయోగించి ప్రస్తుత సమాజంలోని శత్రువులను త్వరగా అంతమొందించడానికి ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తుంటారని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ వి ఉమేందర్, జైనథ్ సీఐ కే.నరేష్ కుమార్, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ ఎం.వంశీకృష్ణ, ఎస్సై బిట్ల పెర్సిస్, ఈ బృందాలకు సహాయంగా ఆదిలాబాద్ ఫైర్ డిపార్ట్‌మెంట్, హెల్త్ డిపార్ట్‌మెంట్ ద్వారా అంబులెన్స్ ను ఏర్పాటు చేశారు.

మైనారిటీలు విద్యారంగంలో ముందుండాలి

- మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్

నవతెలంగాణ-ఖానాపూర్

మైనార్టీ విద్యార్థులు విద్యారంగంలో ముందుండాలని మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్ అన్నారు. బుధవారం ఖానాపూర్ పట్టణంలో గల మైనారిటీ గురుకుల పాఠశాలలో 2023-2024విద్యాసంవత్సరానికి గాను ప్రవేశాలకోసం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఎం.సత్యం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 5లో తరగతి చదివించుట కొరకు మైనారిటీ, క్రిస్టియన్, సిక్, పార్శి, జైన, మతస్తులతో పాటూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ విద్యార్థులకు కూడా ఎటువంటి పరీక్ష లేకుండా అడ్మిషన్ తీసుకుంటారని అన్నారు. కాని నాన్ మైనారిటీ విద్యార్థుల కోసం లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేస్తారని, 6,7,8వ తరగతిలో కేవలం ముస్లిం విద్యార్థులకు మాత్రమే ఖాళీ ఉన్న సీట్ల కోసం ఎటువంటి రాత పరీక్ష లేకుండా అడ్మిషన్ ఉంటుందని అన్నారు. తల్లిదండ్రులు అడ్మిషన్ కోసం తమకు తెలిసిన వారి వివరాలతో వెంటనే పాఠశాల యందు 30తేదిలోపు సంప్రదించగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ అబ్దుల్ ఖలీల్, ఆర్ఎలసి కెప్టెన్ మొహమ్మద్ సలీముద్దీన్, మెరజుద్దీన్, సర్జిల్ హైమద్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

నవతెలంగాణ-ఉట్నూర్



రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని దంతన్‌పల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై భరత్ సుమన్ తెలిపిన వివరాల ప్రకారం.. దంతన్‌పల్లి గ్రామానికి చెందిన మూతి రాజన్న(26) కూలీ కోసం ట్రాక్టర్ పనుకు వెళ్తుండేవాడు. ప్రతి రోజు మాదిరిగానే మంగళవారం రాత్రి ట్రాక్టర్ పనుల కోసం వెళ్లాడు. పనులు ముగించుకొని ట్రాక్టర్ (టీఎస్01యూఏ 9939)పై వస్తున్న సమయంలో ట్రాక్టర్ డ్రైవర్ ఆకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో మృతుడు ఎగిరి పడ్డాడు. మృతుడి తలకు తీవ్రగాయాలు కావడంతో వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడు. నిర్లక్ష్యంగా ట్రాక్టర్ నడిపిన డ్రైవర్ శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. అనంతరం మృతుడి కుటుంబానికి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోజ్జు బుధవారం పరామర్శించారు. మృతుడి కుటుంబానికి పార్టీ తరపున ఆదుకుంటామని ఆయన కుటుంబ సభ్యులు హామీ ఇచ్చారు.

మిడిల్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ తుది జాబితా విడుదల

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ఎన్‌హెచ్ఎం విభాగంలో మిడిల్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ 9 పోస్టులకు సంబంధించిన తుది జాబితా విడుదల చేశామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబితాను మెరిట్, ఆర్ఓఆర్ ద్వారా 1:3 చొప్పున ఎంపిక చేశామని, వివరాలను కార్యాలయ నోటీస్ బోర్డులో ఉంచామని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు 21న జరిగే కౌన్సెలింగ్‌కు అన్ని ఒరిజినల్ ధ్రువ పత్రాలతో ఉదయం 11గంటలకు ఆ శాఖ కార్యాలయంలో హాజరుకావాలని సూచించారు.

ఆటో బోల్తాపడి వ్యక్తి మృతి

నవతెలంగాణ - లోకేశ్వరం

బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో ఆటో అదుపుతప్పి బోల్తాపడడంతో వ్యక్తి దుర్మరణం పాలైన సంఘటన మండలంలో జరిగింది. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పుస్పూరు గ్రామానికి చెందిన ధర్మాజీ భోజన్న(45) స్నేహితుడు సాయికుమార్‌తో కలిసి ఆటోలో పిప్రి గ్రామానికి బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో భోజన్న మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయికుమార్ తెలిపారు.

కంటి వెలుగు ఏర్పాట్లను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్

నవతెలంగాణ - పెంచికల్‌పేట్

మండల కేంద్రంలో నేటి నుండి ప్రారంభమయ్యే కంటి వెలుగు కార్యక్రమ ఏర్పాట్లను జిల్లా అడిషనల్ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18ఏండ్లు నిండిన వారందరు కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. అంతకుముందు మండలంలోని చెడ్వాయి, ఎలుకపెల్లి, పోతెపెల్లి గ్రామాల్లో పర్యటించిన ఆమె చెడ్వాయి, పోతెపెల్లి పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను, మధ్యాహ్నభోజనం నాణ్యతపై ఆరా తీశారు. పోతెపెల్లి గ్రామంలో క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించి రోడ్డుకు ఇరువైపుల నాటిన మొక్కలను పరిశీలించారు. ఎలుకపెల్లి గ్రామంలో నర్సరీని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి చంద్రమౌళి, మేకల కమల సర్పంచ్, తహసీల్దార్ స్మిత, ఎంపీడీఓ గంగాసింగ్, ఏపీఓ సతీష్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.